

సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది.. సరదా..సందడి తెచ్చేసింది.. చిన్నా పెద్దలు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు.. ఆకట్టుకున్నారు..అందంగా రంగవల్లులు వేశారు.. భోగిమంటలు వేశారు.. మూడు రోజుల పండుగను ఒకే రోజులో ముగించారు.. పాఠశాలలకు శుక్రవారం నుంచి సెలవులు కావడంతో నాలుగు రోజులు ముందుగానే జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో సంక్రాంతి పండుగ చేశారు..కొవ్వూరులో ఇలా - వివరాలు 6లో

నేడు ఉత్తర ద్వార దర్శనం

వాడపల్లిలో ముస్తాబు

ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం స్వామి, అమ్మవార్లు ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అన్నవరంలో సత్యదేవుడిని శ్రీమహా విష్ణువుగా, అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి ఉత్తర ద్వారాన దర్శనం ఇవ్వనున్నారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని ఫలపుష్పాలతో అలంకరించారు. కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ముస్తాబైంది. జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. 4





అన్నవరంలో సిద్ధమైన వైకుంఠ ద్వారం

పండగ బాదుడే..



పెద్ద పండుగకు వద్దామంటే.. ప్రైవేటు దోపిడీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సమీపించడంతో టిక్కెట్ ధరలు షాక్ కొడుతున్నాయి. సామాన్యుడికి అందకుండా ఆకాశాన్నంటుతున్నాయి. పండగకు ఇంటికి రావాలనుకునేవారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అధికంగా హైదరాబాద్ నుంచి వస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ రెట్టింపు ధరలు పిండేస్తుండగా రైళ్లలో ఒక్క సీటు లేని పరిస్థితి. పోనీ విమానంలో వద్దామనుకుంటే అవి కూడా ఫుల్ అయిపోయాయి. డిమాండ్ పెరగడంతో ఇండిగో కంపెనీ చార్జీలను భారీగా పెంచేసింది. పండగ రద్దీ పేరుతో సాధారణ రోజుల్లో ఉండే విమాన చార్జీ ధర రూ.3,299 కాస్తా ఇప్పుడు ఏకంగా రూ.15,850కి పెరిగిపోయింది.ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఇండిగో రోజుకు ఆరు సర్వీసులు నడుపుతోంది. శుక్రవారం నాటికి ఐదు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా, ఒకే ఒక విమానంలో అరకొరగా సీట్లున్నాయి. అయితే వీటి చార్జీ ధర ఏకంగా రూ.15,086గా ఉంది. ఒకరకంగా ఐదు రేట్లు పెరిగిపోయి చార్జీలు షాక్ కొడుతున్నాయి. శనివారం అయితే నాలుగు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా రెండింటిలో మాత్రమే కొద్దిగా సీట్లున్నాయి. అయితే చార్జీలు రూ.14,486 చొప్పున కంపెనీ వసూలు చేస్తోంది. ఈనెల 12న అయితే టికెట్ ధరలు రూ.15,850 చొప్పున ఇండిగో వసూలు చేస్తోంది. 13న అంటే భోగి రోజున కాస్త డిమాండ్ తక్కువగా ఉండడంతో రూ. 11,650 వరకు చార్జీలు ఉన్నాయి. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో రైల్వేశాఖ హైదరాబాద్ నుంచి కాకినాడకు రోజుకు మూడు ప్రత్యేక రైళ్లను అదనంగా నడుపుతోంది. వీటిలోనూ సీట్లన్నీ నిండిపోయి వెయిటింగ్ లిస్ట్ 290 వరకు ఉంది. మరికొన్నింటిలో ఏకంగా రిగ్రేట్ చూపుతోంది. వీటిలో సీట్ల లభ్యత ఈనెల 14 నుంచి మాత్రమే ఉన్నాయి. పండగ తర్వాత తిరిగి హైదరాబాద్ ప్రయాణం అయ్యేవారికి ఇప్పటినుంచే విమాన చార్జీలు షాక్ కొడుతున్నాయి. ఈనెల 15న రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమాన చార్జీ సమయం బట్టి రూ.10,384 నుంచి రూ.14,887 వరకు ఎగబాకాయి. 16న ఏకంగా రూ.16,394 వరకు చార్జీలు పెరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే ఈనెల 19 వరకు తిరుగు ప్రయాణానికి సంబంధించి బాదుడే బాదుడు అన్నట్టు కొనసాగుతోంది.

రోజుకు రూ.1.65 కోట్ల దోపిడీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో కాకినాడ నుంచి 40 ప్రైవేట్ బస్సులు, అమలాపురం రాజోలు నుంచి 50 ప్రైవేట్ బస్సులు, రాజమహేంద్రవరం నుంచి 60 ప్రైవేట్ బస్సులు వెరసి 150 ప్రైవేట్ బస్సులు హైదరాబాద్, బెంగుళూరు పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కొక్క బస్సులోనూ సుమారు 50 నుంచి 55 మంది 8,250 మంది చొప్పున ప్రయాణిస్తుంటారు. పండుగ పేరిట స్పెషల్ ధరలతో ప్రయాణికుల నుంచి ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లు సుమారు రూ. 1.65 కోట్ల మేర ప్రతి రోజూ అదనపు వసూళ్లు చేస్తూ దారుణ దోపిడీకి గురిచేస్తున్నారు. అయినా ప్రభుత్వం కళ్లు తెరవకపోవడం గమనార్హం.

- రైళ్లన్నీ రిగ్రేట్.. బస్సులన్నీ ఫుల్
- పండుగంతా ప్రైవేట్ స్పెషల్‌దే
- బస్సు టిక్కెట్ల ధరకు రెక్కలు
- రెట్టింపు ధరల వసూళ్లు
- సీటు అయితే రూ.2 వేలు
- బెర్త్ రూ.3 వేలు
- రద్దీ పేరిట భారీ వసూళ్లు
- ఆకాశంలో విమాన చార్జీలు
- మూడు రెట్లు పెరిగిన వైనం
- ఆర్టీసీ బస్సులకు భారీ డిమాండ్

ఆర్టీసీ ఏం చేస్తుందో..

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంక్రాంతి బస్సు సర్వీసులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రజల నుంచి ఈ డిమాండ్ ఎక్కువగా వినబడుతోంది. ఇప్పటికే జిల్లా ఆర్టీసీ ప్రీ-సంక్రాంతి ఆపరేషన్‌లో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోల నుంచి 88 స్పెషల్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే ఈ స్పెషల్ సర్వీసుల్లో టిక్కెట్లన్నీ గతంలోనే హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. వీటితోపాటు షెడ్యూల్ సర్వీసుల్లోనూ టిక్కెట్లు లేవు. దీంతో హైదరాబాద్ నుంచి మరిన్ని బస్సులు నడపాలనే డిమాండ్ వస్తున్నట్టు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్థిరపడిన వారు పెద్ద పండక్కి సొంతూర్లకు తరలివస్తారు. ఆర్టీసీ సర్వీసుల్లో సాధారణ బస్సు చార్జీలను మాత్రమే వసూలు చేస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. జిల్లా ఆర్టీసీ మాత్రం హైదరాబాద్ నుంచి జిల్లాకు మరిన్ని స్పెషల్ సర్వీసులు నడిపేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నట్టు కనబడుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా భారీగా ఆదాయం పొందే అవకాశం ఉన్నా ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారులు ఇప్పటివరకూ అదనపు స్పెషల్స్‌పై ఎలాంటి ప్రకటనా చేయలేదు.

పండుగ పూట.. ప్రైవేట!

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజుల్లో సంక్రాంతి. రైళ్లన్నీ ఫుల్ కావడంతో హైదరాబాద్, బెంగళూరు, మైసూర్, చెన్నై ప్రాంతాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, కాకినాడ, రంగంపేట, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, అటు కోనసీమ ప్రాంతాలకు వచ్చేందుకు ప్రైవేట్ ఏజెన్సీల వద్దకు జనం పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆపరేటర్లు టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశారు. ఆన్‌లైన్‌లో భారీ ధరలకు టిక్కెట్ల విక్రయాలకు పోటీపడుతున్నారు. సంక్రాంతి పండుగను సొంతూళ్లో జరుపుకోవడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల కల. దీనిని ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లు ఫుల్ కావడంతో ప్రయాణికులకు ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న ప్రైవేట్ బస్సుల టిక్కెట్ల ధరలను పెంచేశారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి సామర్లకోట మీదుగా కాకినాడకు రూ.890-900 మధ్య టిక్కెట్ ధరలను వసూలు చేస్తారు. బెంగుళూరు నుంచి రూ.1,500 నుంచి రూ.1,800 మధ్య వసూలు చేస్తారు. ప్రస్తుత ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో హైదరాబాద్ నుంచి సామర్లకోటకు సీటు ఒక్కింటికి రూ. 1,880 వసూలు చేస్తున్నారు. ఇదే బెర్తులైతే రూ.2300-2600 చొప్పున వసూలు చేస్తున్నారు. చెన్నై, ముంబై వంటి ప్రాంతాల నుంచి టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అప్పర్, లోయర్ బెర్త్ అంటూ వేరు చేసి డిమాండ్‌ను బట్టి రూ.1,880 నుంచి రూ.3 వేల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు పిండేస్తున్నారు.

నేటి నుంచి ప్రైవేటు బస్సుల తనిఖీలు : డీటీవో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేసినా, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ హెచ్చరించారు. వాహనాలకు సరైన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా జప్తు చేస్తామని స్పష్టంచేశారు. రాజమహేంద్రవరం డీటీవో కార్యాలయంలో గురువారం జిల్లాలోని ప్రైవేట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యజమానులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా తనిఖీలకు రవాణా అధికారులతో కూడిన స్పెషల్ టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బస్సుల్లో ప్రయాణికుల లగేజీ బ్యాగులు మాత్రమే ఉండాలని, వాణిజ్యపరమైన వస్తువులను తరలించకూడదన్నారు. ప్రయాణికులు సురక్షితంగా తీసుకురావాలని కోరారు.

తెలుగు వెలగాలి



ముగిసిన తెలుగు మహాసభలు



రాజమహేంద్రవరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లకు సన్మానం చేస్తున్న జీజీయూ కులపతి చైతన్య రాజు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మాడుగుల నాగఫణిశర్మ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు

తెలుగు వెలగాలి.. తెలుగును బతికించుకుందాం.. తెలుగును కాపాడుకుందాం.. తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడదాం.. ఇంగ్లీషు వద్దు.. తెలుగేరా ముద్దు.. ప్రతి ఒక్కరి నోటా ఇదే మాట.. అందుకు ఏమైనా చేస్తామని.. ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తామని నాయకులు ప్రతినబూనారు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీయూలో చివరి రోజు గురువారం ప్రపంచ తెలుగు మహాసభ అట్టహాసంగా సాగింది. దీనిలో భాగంగా పలువురు ప్రముఖులు తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా అంటూ పిలుపునిచ్చారు.. తెలుగు ప్రాముఖ్యత నలుదిశలా వినిపించేలా చాటారు. 'తల్లిదండ్రుల్లో మార్పురావాలని.. తమ పిల్లలను తెలుగులోనే చదివించాలని .. కూటమి ప్రభుత్వం తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడుతుందని' కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.. 'సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారని, కింద స్థాయి నుంచి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టడం కోసం త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని' మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. 'మధురమైన, అద్భుత భాష తెలుగును భావితరాలకు అందించాలని.. ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషల్లో తెలుగు 15వ స్థానంలో ఉండగా, మన దేశంలోని భాషల్లో తెలుగుకు నాల్గవ స్థానం ఉందని' బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు.. జీజీయూ చైర్మన్ చైతన్యరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది తెలుగు సంక్రాంతి పండుగను నిర్వహిస్తానన్నారు. కాగా తెలుగు మహాసభల్లో భాగంగా అచ్చతెలుగులో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అబ్బురపరిచాయి.. 4



తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా.. అంటూ చిన్నారి ప్రదర్శన..

ప్రజలకు 37 కేంద్ర పథకాలు ఇస్తున్నాం

పథకాలపై సమీక్షలో ఎంపీ పురందేశ్వరి



కేంద్ర పథకాల అమలుపై సమీక్షిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి కో ఆర్డినేషన్,మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో లోపాలు గుర్తించి సమీక్షిస్తున్నామన్నారు. జిల్లా అధికారుల సూచనలు పరిగణనలోకి తీసుకుని కేంద్రానికి నివేదిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో 37 పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రతి మూడు నెలలకోసారి దిశ రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామన్నారు. హెచ్ఎంపీవీ వైరస్‌ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో జలజీవన్ మిషన్, అమృత్ వంటి పథకాలు నిర్వీర్యం కావడం చూశామన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రానున్న రోజుల్లో ప్రజలకు మేలు చేయాలన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మాత్రమే నిధులు వినియోగించాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధి నిధులు సమర్థవంతంగా ఖర్చుచేశామన్నారు. 60 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. సమీక్షలో జడ్పీ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు,ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ , జిల్లా అధికారులు వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు ,ప్రజాప్రతినిధులు ,అధికారులు పాల్గొన్నారు.



ఇసుక అక్రమ రవాణా మూడు ప్రొక్లెయినర్లు సీజ్

కడియం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమాలు అన్నీ ఇన్నీ కాదు.. అయినా ఉన్నతాధికారులు మాత్రం ఎందుకో దృష్టి సారించడంలేదు.. మండల స్థాయి అధికారులు అడపా దడపా తనిఖీలు చేసినా రీచ్‌లలో చోరులు చిక్కుతున్నారు. కడియం మండలం వేమగిరి-బుర్రిలంక ర్యాంపులో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులతో కూడిన టాస్క్ ఫోర్స్ బృందం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించి మూడు ప్రొకెయినర్లను సీజ్ చేయించినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

రాత్రివేళ అక్రమ రవాణా

వేమగిరి-బుర్రిలంక ఇసుక ర్యాంపులో అర్ధరాత్రి సమయంలో భారీ మొత్తంలో ఇసుక తరలింపు జరుగుతుందని జనసైనికులతో పాటు పలువురు ఆరోపిస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో ఇసుక తరలిస్తున్న దృశ్యాలతో గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా, నాయకుల అండదండలతో అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు, యువత జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్టీ బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహంలో గురువారం ప్రాజెక్టు ఐరన్ ప్లస్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు.మనం నిత్యం తీసుకునే ఆహారంలో పోషక విలువలు ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.కౌమారదశలోని ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించే క్రమంలో ప్రాజెక్టు ఐరన్ ప్లస్ కింద ఐరన్ మాత్రలతో పాటు మునగాకు పొడిని వసతిగృహాల్లోని బాలికలకు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం హాస్టల్ విద్యార్థినులకు కలెక్టర్ భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రశాంతి


ప్రముఖ కవి అందెశ్రీని సత్కరిస్తున్న ప్రముఖులు


నటి హేమను సత్కరిస్తున్న ప్రముఖులు


బీజేపీ నేత సోము వీర్రాజుకు సత్కారం



తేనెలొలుకు.. తెలుగు

పులకించిన తెలుగు తల్లి

- తరలివచ్చిన భాషాభిమానులు
- వివిధ ప్రాంతాల యాసలతో ప్రతిధ్వనించిన జీజీయూ
- అలరించిన చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు
- అతిథులకు పురస్కారాలు...సత్కారాలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష మాధుర్యం, వేర్వేరు ప్రాంతాల యాసలతో తెలుగు తల్లి పులకించింది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభల ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మాతృభాషను కీర్తిస్తూ పలువురు రాజకీయ ప్రముఖులు, కవులు, రచయితల ప్రసంగాలతో తెలుగు తల్లి ఉప్పొంగి పోయింది. తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ భాషాభిమానులంతా తన్మయత్వంలో మునిగితేలారు. జీజీయూ కులపతి కలిదిండి సత్యనారాయణరాజు(చైతన్యరాజు) అధ్యక్షతన రాజరాజ నరేంద్ర వేదికపై ప్రారంభమైన రెండో రోజు వేడుకలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సభాధ్యక్షత వహించగా, ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులు శంఖారావం పూరించి సభలను ప్రారంభించారు. పలువురు రాజకీయ సాహితీ ప్రముఖులు, అవధానులు, కవులు, రచయితలు, కళాకారులు తెలుగు భాష ఔన్నత్యాన్ని వెలుగెత్తి చాటారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తెలుగు మహాసభలను పురస్కరించుకుని జీజీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలువురు కవులు, రచయితల విగ్రహాలను చూస్తుంటే తెలుగుదనం ఉట్టిపడుతుందన్నారు. ఇటువంటి సభలను గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువచేసి మరుగున పడుతున్న మాతృభాషను, సంస్కృతిని పరిరక్షించాలని చైతన్యరాజుకు సూచించారు. అమెరికాలో పుట్టిన పిల్లలు సైతం తెలుగులో మాట్లాడుతున్నారని, తెలుగు భాష పరిరక్షణ ఒక ఉద్యమం మాదిరిగా గ్రామీణ స్థాయికి తీసుకెళ్లి మరింత పటిష్టం చేయాలన్నారు.

తెలుగు భాష, సంస్కృతికి.. పుట్టినిల్లు

గోదావరి ప్రాంతం తెలుగు భాష, సంస్కృతికి పుట్టినిల్లు వంటిదని మరో కవి నడింపల్లి కృష్ణ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. తెలుగు భాష మానవతా విలువలను నేర్పుతుందని, దానిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాష జీవితాన్నిస్తుందని, ఆస్ట్రేలియాలో తెలుగు కోసం, తెలుగు వారి కోసం తెలుగు బడులు ప్రారంభించామన్నారు. ఆస్ట్రేలియాలో తెలుగు భాషను ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకునే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. రానున్న ఏడాదిలో ఆస్ట్రేలియాలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించ తలపెట్టామని, దానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా చైతన్యరాజును కోరారు.

ఒదుగుదల భాష తెలుగు

కవి గరిమెళ్ల వరప్రసాద్

కవి గరిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ఒదుగుదల కలిగిన భాషగా చెప్పారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, నెల్లూరు ప్రాంతాలకు ఒక యాస ఉంటుందంటూ ఆయా ప్రాంతాల యాసలతో తిరుపతి వెంకటకవుల రచించిన పద్యాలను ఆలపించారు. తెలుగు భాష కొంత నేర్చుకుంటే చాలు పద్యాలను అలవోకగా రాయవచ్చంటూ కవితలు, రచనలతో తెలుగు భాష తియ్యదనాన్ని చాటిచెప్పారు. మరో ముఖ్యఅతిథి, భారతీయ కవి, గేయరచయిత అందెశ్రీ మాట్లాడుతూ తెలుగు భాషకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో మరే భాషను నేర్చుకోలేదన్నారు. ప్రస్తుత సమాజంలో మనుషుల్లో మానవత్వం కొరవడుతుందని, మాయమైపోతున్నాడమ్మా..మనిషన్నవాడు అనే పాటను ఆలపిస్తూ అందరి హృదయాలను కదిలించారు. సిలికాన్ ఆంధ్ర మన బడి వ్యవస్థాపకుడు చామర్తి రాజు మాట్లాడుతూ తెలుగు భాష మృత భాష కాదని, అమృత భాష అని అభివర్ణించారు. తెలుగు భాష కోసం తాను చేస్తున్న ఉద్యమంలో భాష నేర్పేందుకు సిలికాన్ ఆంధ్ర సిద్ధంగా ఉందన్నారు. తెలుగు భాష వైభవాన్ని జీజీయూ ప్రాంగణంలో కూడా కొనసాగించాలని చైతన్యరాజు కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రపంచ తెలుగు మహాసభలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చేసిన పలు శాస్త్రీయ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి.





అతిథులకు సత్కారాలు

రాజానగరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహా సభలను పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులను జీజీయూ కులపతి చైతన్యరాజు సారధ్యంలో పలువురు మంత్రులు సమక్షంలో ఘనంగా సత్కరించి, పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ దంపతులను, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. అలాగే చామర్తి రాజు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కవి గరిమెళ్ల వరప్రసాద్, వసుదా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంక దినకర్, అందె శ్రీను, గోపిమూర్తిలను ఘనంగా సన్మానించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, ప్రోఛాన్సలర్ శశికిరణ్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ రవివర్మ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, జీజీయూ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష ఎంతో మధురం

లంక దినకర్

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ మాతృభాషలో ఉన్న మాధుర్యం మరే భాషలోనూ లేదన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు మన ప్రాంతానికి విచ్చేసి సేదదీరిన సమయంలో ఆలపించిన పద్యాలను మరో మారు గుర్తు చేస్తూ ఆలపించారు. ఈ జగత్తులో తెలుగు భాష ఉన్నంత కాలం దిగ్విజయంగా ఉండాలని, ప్రధాని నరేంద్ర మోదీ మాతృభాషపై దృష్టిసారిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు భాషను చాటిచెప్పాలన్నారు.

అమ్మను మర్చిపోయినట్టే..

ఎమ్మెల్యే బత్తుల

తెలుగు భాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్లే అవుతుందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి చైతన్యరాజు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తెలుగు మధురంగా ఉంటుందన్నారు.

తెలుగింటి అమ్మాయిని కావడంతోనే నాకీ ఆదరణ

నటి హేమ

మీరందరూ నన్ను ఇంతగా అభిమానించడానికి కారణం నేను గోదావరి జిల్లా అమ్మాయిని.. రాజోలు అమ్మాయిని.. తెలుగు అమ్మాయిని. 500 లకు పైగా సినిమాల్లో నటించానంటే అందుకు ప్రధాన కారణం నా తెలుగు భాష. మా అమ్మ, నాన్న ఆకారాన్నిస్తే నా వెటకారంతో ఆర్టిస్టును కాగలిగాను.. లక్షలాది మంది అభిమానుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించగలిగానన్నారు.నన్ను ఆదరించడానికి కారణం తెలుగు భాష అన్నారు. మా అమ్మ, తమ్ముడు అందరూ గోదావరి జిల్లా రాజోలులోనే ఉంటున్నారు అందుకే ప్రతి ఏడాది సంక్రాంతికి ఇక్కడికే వస్తా.. నా గోదావరి జిల్లా అంటే చాలా ఇష్టం. ఇక్కడ పుట్టడం నా అదృష్టంగా భావిస్తా. నన్ను గోదావరిలో ఈత కొట్టించడం మా నాన్నకు ఇష్టం. నాన్న కోసం గోదావరిలో సగం ఈత కొట్టాను. మధ్యలోనే చదువు ఎగ్గొట్టి సినీ ఇండస్ట్రీకి వెళ్లిపోయాను. నాకు చదువు రాకపోయినా నన్ను ఆదరించి, అభిమానించింది మాత్రం తెలుగు భాష వల్లే అని గర్వంగా చెప్పుకుంటానన్నారు. ముస్లిం ఇళ్లలో ఖురాన్ ఉంటుంది. క్రైస్తవులు ఇళ్లలో బైబిలు ఉంటుంది. ప్రతి హిందువు ఇళ్లలో భగవద్గీత ఖచ్చితంగా ఉండి తీరాలన్నారు. చివరిగా గోదావరి యాసలో నమస్తే అండీ, బాగున్నారండీ, ఎప్పుడొచ్చారూ, భోంచేసి వెల్లండే అంటూ అందరినీ కడుపుబ్బ నవ్వించి ముగించారు.


అన్నవరంలో పుష్పాలంకరణతో ఏర్పాటుచేసిన తూర్పురాజగోపురం ప్రక్కన నమూనాలయం

నేడు సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం

- పుష్పాలంకరణలో ఆలయం ముస్తాబు
- తిరుపతి సంఘటన నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు

అన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం స్వామి,అమ్మవార్లు ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీనికి సంబంధించి ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. ఉత్తరద్వారాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబుచేయించారు. తూర్పురాజగోపురం ప్రక్కన నమూనాలయం మాదిరి ఏర్పాటుచేశారు. ప్రధానాలయంలో మూలవరులను, వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషపాన్పుపై పవళించే శ్రీమహావిష్ణువుగా సత్యదేవుడిని, ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్న లక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించి ఏకకాలంలో మూలవరులు, ప్రత్యేక అలంకరణలోఉన్న ఉత్సవమూర్తులను భక్తులు దర్శించేవిధంగా ఏర్పాటుచేశారు. ఉదయం 5గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు భక్తులకు ఉత్తరద్వారం లో సత్యదేవుడిని దర్శించుకునే అవకాశం కల్పించారు. సుమారు 50వేలమంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని అంచనావేస్తూ దానికనుగుణంగా అధికారులు ఏర్పాట్లుచేశారు. భక్తులకు కదంబప్రసాదాన్ని అందించనున్నారు.

దేవస్థానంలో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

- భక్తుల సేవలే పరమావధిగా వ్యవహరించాలి
- ఆర్థిక పరిస్థితి బాగాలేనందున వృథాఖర్చులు తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేవస్థానంలో పనిచేసే ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయడంతో పాటుగా భక్తుల సేవలే పరమావధిగా వ్యవహరించాలని ఈవో సుబ్బారావు సూచించారు. గురువారం సాయంత్రం దేవస్థానంలో అన్ని విభాగాలలో ఉద్యోగులందరితో సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ వోపీ ఆదేశాలను వివరించారు. దేవస్థానంలో ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉందని, వృథా ఖర్చులు తగ్గించాలని సూచించారు. సిబ్బంది తరుపున వచ్చేవారికి ప్రత్యేక దర్శన టిక్కెట్లు కనీసం సగమైనా తీయించాలని తద్వారా కొంత ఆదాయం పొందవచ్చునని సూచించారు. ప్రసాదం విభాగంలో పనిచేసే సూపరింటెండెంట్‌కు అదనపు విభాగం అప్పగించకూడదని తద్వారా పూర్తి పర్యవేక్షణతో పనిచేస్తారని అన్నారు, ఆలయాలకు విచ్చేసే భక్తులకు దర్శనం, ప్రతక్యూలైన్‌లు పటిష్ఠంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ డ్రెస్‌కోడ్ పాటించి గుర్తింపుకార్డు ధరించాలన్నారు. భక్తుడు కొండదిగువ నుంచి కొండపైకి వచ్చేవరకు తనకు కావలసిన సౌకర్యాలు ఎక్కడ లభిస్తాయో తెలిసేవిధంగా ఎక్కడికక్కడ సైన్‌బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో ఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యూలైన్లు పరిశీలన : తిరుపతి సంఘటన నేపథ్యంలో అన్నవరం దేవస్థానంలో క్యూలైన్లను ఈవో సుబ్బారావు పరిశీలించారు. క్యూలైన్‌లు పటిష్ఠంగా ఉండాలని భక్తులను ఒక్కసారిగా వదలకుండా నిరంతరం క్యూలైన్‌ద్వారా భక్తుల నడకసాగేలా చూడాలని సూచించారు.

ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

- 50వేలు పైబడి భక్తులు వస్తారని అంచనా
- త్వరితగతిన దర్శనాలు జరిగేలా అధికారుల సమాయత్తం



పుష్పాలంకరణలో వాడపల్లి వెంకన్న ఆలయం, ముక్కోటి సప్త ద్వారాలు

ఆత్రేయపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులకు సకాలంలో స్వామి దర్శనం అందించేలా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. వైకుంఠ ద్వారం వద్ద సప్తద్వారాలను ఫలపుష్పాలతో అలంకరిస్తున్నారు. వసంత మండపం ముఖమండపం, అంతరాలయం, ప్రకార మండపాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరిస్తున్నారు. భక్తులు వెళ్లే ద్వారాలవద్ద సుంగధ పరిమళాలు వెదజల్లే పుష్పాలను అలంకరిస్తున్నారు. శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు ఉత్తర ద్వారం వద్ద కొలువుతీరి భక్తులను కటాక్షించనున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి తిరుప్పావై సేవ అనంతరం భక్తులకు ప్రముఖులకు దర్శనాలను అందించనున్నారు. ఉదయాన్నే గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి వరకు భక్తులకు వైకుంఠ ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేస్తున్నారు. 50వేలు పైబడి భక్తులు రానున్నట్లు అంచనావేసి ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఏర్పాట్లపై రాష్ట్ర కమిషనర్ సూచనలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర దేవదాయ కమిషనర్ సత్యనారాయణ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన సంఘటనపై కమిషనర్ గురువారం 13 జిల్లాలోని ఈవోలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి తోపులాటలు జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు బిస్కట్లు, పాలు, ప్రసాదం పంపిణీ చేయడంతోపాటు త్వరితగతిన దర్శనాలు జరిగేలా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అందించాల్సిన సౌకర్యాలను, దర్శనాలను త్వరితగతిన అందించాలని తగుసూచనలు అందించారు. ఎస్ఐ ఎస్.రాము, తహశీల్దారు రాజేశ్వరరావులు వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ

తిరుమల ఘటన నేపథ్యంలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం రాత్రి జిల్లా ఎస్పీ కృష్ణారావు సందర్శించారు. వెంకన్న ఆలయానికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో చేపట్టే ఏర్పాట్లపై ఆయన పరిశీలించారు. భారీకేడ్లు, క్యూలైన్లు, తదితర ఏర్పాట్లను పరిశీలించి ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో ఆయన సమీక్షించారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టనున్నారు. ఈయన వెంట డీఎస్పీ గోవిందరావు, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.


ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు


వాడపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు


వాడపల్లి వెంకన్న ఆలయంలో ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ

వాడపల్లిలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లపై జిల్లా అధికారులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు గురువారం ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులను ఆదేశించారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఉత్తరద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం సిద్ధం

మామిడికుదురు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్నిపురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మామిడి కుదురు మండలం అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారు శుక్రవారం వైకుంఠ ద్వారం ద్వారా దర్శనం ఇస్తారు. వైకుంఠ ద్వార దర్శనాన్ని పురస్కరించుకుని దేవస్థానాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటుప్ల చేసినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.


అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో పూలతో అలంకరించిన ధ్వజస్తంభం

వైభవంగా భద్రగిరి రాములోరి తెప్పోత్సవం





బోట్‌లో ఆశీనులైన స్వామివారు, గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

విఆర్‌పురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి) రెండో భద్రగిరిగా పేరుగాంచిన వీఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరి కొండపైఉన్న శ్రీసుందర సీతారామ చంద్రస్వామివారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం స్వామివారిని ఆలయం నుంచి పురవీధుల గుండా హంసవాహనంపై ఆశీనులనుగావించి పవిత్ర గోదావరిలో అర్చకుడు పురుషోత్తమాచార్యులు స్వామివారిని బోట్‌పై ఆశీనులను చేసి తెప్పోత్సవం నిర్వహించారు. రాములోరి తెప్పోత్సవాని తిలకించేందుకు మండలంలోని వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి, సీతంపేట రాజుపేట తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పెందుర్తి సుదర్శన్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, బీరక సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.



హెచ్‌ఎంపీవీ వైరస్..
భయాందోళన వద్దు



- శీతాకాలంలో కాలనుగుణ వ్యాధి
- అవగాహనతోనే ఆరోగ్య రక్షణ
- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే చాలు
- కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

కరోనా వైరస్.. ఈ పేరు వింటేనే ప్రజలు ప్రాణభయంతో గజగజవణికిపోయేవారు. ఈ వైరస్ బారిన పడి చాలామంది మరణించారు. ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారి శకం ముగిసింది. కానీ చైనా నుంచి మరో ప్రాణాంతక వైరస్ ఇప్పుడిప్పుడే విస్తరిస్తోంది. ఈ వైరస్ పేరు హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ). ఇది కర్నాటక రాష్ట్రంలో తొలిసారిగా రెండు కేసులు నమోదైనట్లు నిర్ధారణ కావడం పట్ల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ వైరస్ రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్, ఫ్లూ వంటి వ్యాధులతో సోకుతుంది.

జీజీహెచ్(కాకినాడ), జనవరి9(ఆంధ్రజ్యోతి): భారత్‌లో తొలిసారిగా కర్నాటక రాష్ట్రంలో ఈ వైరస్ బాధిత కేసు నమోదైంది. బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న 3నెలల చిన్నారిలో హెచ్‌ఎంపీవీ వైరస్ లక్షణాలు గుర్తించారు. 2వ కేసు కూడా జనవరి 3న కర్నాటకలో బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న 8నెలల బాలుడిని గుర్తించి వైద్యులు చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. ఈ వైరస్‌పై ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీఎంఆర్‌ని అలర్ట్ చేసింది. సాధారణంగా శీతాకాలంలో సంభవించే కాలానుగుణ వ్యాధిఇది. ఈవైరస్‌పై భయాందోళనలకు గురికానవసరం లేదని, అవగాహనతో ఆరోగ్యంగా ఉండవచ్చని రిటైర్డు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ ఎం.రాఘవేందరావు తెలిపారు. ఈ వైరస్ నివారణపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఇలా వ్యాపిస్తుంది..



ఈ వైరస్ తుమ్ములు, దగ్గువల్ల వెలువడే తుంపర్ల నుంచి ఇతరులకు సోకుతుంది. వైరస్ బారిన పడిన వారికి దగ్గర, సన్నిహితంగా ఉన్నవారికి సోకుతుంది. బాధితులను తాకడం, ఆ చేతులతో ముక్కు, కళ్లు, నోటిని తాకినప్పుడు ఈ వైరస్ సోకే అవకాశాలు ఉన్నాయి.

నివారణకు తీసుకోవాల్సిన చర్యలు



ఈ వైరస్ ప్రమాదకారి కాదు. చలికాలంలో చిన్నారులు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిని ఇబ్బందులకు గురి చేస్తుంది. కొన్ని స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వైరస్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. చేతులను తరచూ సబ్బుతో కనీసం 20సెకన్లపాటు శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. చేతులను శుభ్రం చేసుకోకుండా నోరు, ముక్కు, కళ్లను తాకరాదు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ లు ధరించాలి. వైరస్ బారిన పడితే బయట తిరగరాదు. ఇలా బయట సంచరించడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా సోకే అవకాశాలు ఉన్నాయి.

ఇదొక సాధారణ ఫ్లూ

శీతాకాలంలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) సోకుతుంది. ఇది ఒక సాధారణ ఫ్లూ.. జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా చిన్నారులు, పెద్దలకు సోకుతుంది. దగ్గు తగ్గకపోవడంతోపాటు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. చైనాలో కేసులు పెరగడంతో కొవిడ్ నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇది కొవిడ్-19 ఫ్లూ. ఇతర శ్వాస కోశ రుగ్మతలను పోలి ఉంటుంది. జ్వరం రావడం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. ఇన్‌ఫెక్షన్ సోకిన 3 నుంచి 6 రోజుల్లోగా ఈ లక్షణాలు బయటపడతాయి. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిపై ఈ వైరస్ ప్రభావం చూపుతుంది.

భయాందోళన చెందాల్సిన పనిలేదు

హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) ఇది సాధారణ ఫ్లూ. శీతాకాలంలో అందరిలో జలుబు, దగ్గు తదితర ఫ్లూ లక్షణాలు ఉంటాయి. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులకు ఈ ఫ్లూ సోకుతుంది. కొవిడ్‌తో పోల్చుకుంటే ఇది ప్రమాదకరం కాదు. బ్రాంకైటిస్, నిమోనియాతో బాధపడుతున్న వారిని ఈ వైరస్ ఇబ్బంది పెడుతుంది. స్వీయ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. జీజీహెచ్, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ఫ్లూ నివారణకు పలు రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

-డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు, రిటైర్డు డీఎంఈ, కాకినాడ



కాకినాడ జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు





సాయంకాలం సెలవంటూ..!

సాయం సంధ్య వేళ.. సెలవంటూ చీకట్లోకి జారుకుంటూ.. కాకినాడ-సామర్లకోట మధ్య సూర్యాస్తమయం సమయంలో సూర్యుడు ఇలా చిక్కాడు

-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఎంఎస్‌వో పేరిట ఎండీయూ ఆపరేటర్ అక్రమ వసూళ్లు

ఆపరేటర్లకు సెల్‌లో వాయిస్ మెసేజీలు వైరల్

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఎంఎస్‌వోగా పనిచేస్తున్న అధికారికి మండలంలో ఎండీయూ ఆపరేటర్లు ఒక్కొక్కరూ రూ.200 చొప్పున ఇవ్వాలని మండల రేషన్ ఎండీయూ ఆపరేటర్ల సంఘ ప్రతినిధి, ఇటీవల కాలంవరకూ వైసీపీ నాయకులతో అంటకాగిన వ్యక్తి వాయిస్ మెసేజీ పంపడం వైరల్‌గా మారింది. ఈ మేరకు సదరు వాయిస్ మెసేజీని పలువురి విలేకర్లకు గురువారం ఫార్వార్డ్ చేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కార్యాలయం నిర్వహణకోసం ఎండీయూ ఆపరేటర్లకు రూ.200 చొప్పున ఫోన్‌పే ద్వారా తన నెంబరుకు పంపాలని, ఆ డబ్బులకు సంబంధించి స్ర్కీన్ షాట్‌ను తన ఫోన్‌నెంబరుకు పంపాలని వాయిస్ మెసేజీల ద్వారా తెలిపారు. దీన్ని ఎండీయూ ఆపరేటర్లకు మాత్రమే కాకుండా రేషన్ డీలర్లకు సైతం పంపినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సదరు ఎండీయూ ఆపరేటర్‌గా వ్యవహరించిన ఇతను అప్పుడు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను స్వయంగా పాల్గొని రేషన్ డీలర్లను బాధ్యులను చేశారు. వైసీపీ ప్రభుత్వం గద్దె దిగి ఏడునెలలు పైబడినా నేటికీ ఇతని వైఖరిపై తమకు తలనొప్పిగా తయారైందని రెవెన్యూ అధికారులు వాపోతున్నారు. దీనిపై సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి వాస్తవ సమాచారాన్ని సేకరించాలని వీఆర్వోలను ఆదేశించినట్లు తెలిసింది.

ఉత్సాహభరితంగా 'ఆదిత్య' కలర్స్ యూత్ ఫెస్ట్ ప్రారంభం

గండేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కలర్స్-25 యువజనోత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొదటిరోజు ఉదయం 9.30గంటలకు ప్రారంభమైన కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జేఎన్టీయూకే రెక్టార్ డాక్టర్ కేవీ రమణారావు, గౌరవఅతిథిగా ఐక్వేరా ఇన్స్పైర్మేషన్ సర్వీసెస్ ఎల్ఎల్‌సీ ఫౌండర్ అండ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ మాచవోలు, యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు.

విద్యార్థులతో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్, జెయింట్‌వీల్, కొలంబస్, బ్రేక్‌డాన్స్ వంటి వినోదభరిత వాతావరణంతో ఆదిత్య క్యాంపస్ అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు వివిధ రకాల ఫ్యాషన్ డిజైన్‌లతో కూడిన వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఆదిత్య కలర్స్ ఏర్పాటు చేశామన్నారు. సినీ ప్రముఖుల సందడి, లేజర్ షో, విద్యార్థుల ఆటపాటలు ఈ కలర్స్‌లో చోటు చేసుకున్నాయన్నారు. 50వేలమందికి తగ్గకుండా ఏర్పాట్లు చేసి అన్నీ సమకూర్చామన్నారు. స్పోర్ట్స్ గేమ్స్ సాంస్కృతిక విభాగాల్లో పాల్గొనడానికి వివిధ కళాశాలల నుంచి 2వేలమంది విద్యార్థులు రిజిస్టర్ అయ్యారని, 67 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. మొదటిరోజు హీరో నిఖిల్ రాగా, రెండోరోజు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మూడోరోజు హీరో కిరణ్ అబ్బవరం రానున్నట్లు తెలిపారు.

మా కాలేజీలో కలర్స్ లేవు
-హీరో నిఖిల్ సిద్ధార్థ్



నిఖిల్‌ను సన్మానిస్తున్న ఆదిత్య వైస్‌చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి

కలర్స్-25 యువజనోత్సవాల్లో హీరో నిఖిల్ సిద్ధార్థ్ జోష్ పెంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను చూస్తుంటే ఎంతో ఆనందంగాను, ఈర్ష్యగాను ఉందన్నారు. తాను చదువుకున్న ఇంజనీరింగ్ కళాశాలలో ఇటువంటి కలర్స్ లేవన్నారు. చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. తదనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. హ్యాపీడేస్ నుంచి ఇప్పటివరకు 23 సినిమాలు చేశానని, 'ఆదిత్య'లో కిర్రాక్ పార్టీ సినిమా తీశామని యాజమాన్యానికి ఎంతో రుణపడి ఉంటానని తెలిపారు. కిర్రాక్‌పార్టీ సినిమాకు ఆదిత్య వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి ఎంతో సహకరించారన్నారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవాల నిర్వహణపై ఆర్డీవో సమీక్ష



ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

అంబాజీపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి కనుమ సందర్భంగా ఈనెల 15న నిర్వహించే అంబాజీపేటమండలం మొసలపల్లిశివారు జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని సంప్రదాయంగా ప్రశాంతంగా నిర్వహిద్దామని కొత్తపేట ఆర్డీవో పి. శ్రీకర్ సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ కార్యాలయంవద్ద తహశీల్దారు జె.వెంకటేశ్వరి అధ్యక్షతన ఏకా దశ రుద్రులు ఉత్సవ కమిటీ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభల తీర్థంలో మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని సూచించారు. ఆర్డీవో మాట్లాడుతూ తీర్థంలో సౌకర్యాలు ఏర్పాటు చే సేలా అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య పనులు, జంగిల్ క్లియరన్స్‌తోపాటు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తీర్థం జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. జిల్లా దేవదాయశాఖాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో జీవీ సరోవర్, వైద్యాధికారి ఇంద్రావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రబాబు, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, కాండ్రేగుల శ్రీనివాసరావు, నాయకులు దాసరి సత్యనారాయణ, దంతులూరి శ్రీనివాసరాజు,వాసుదేవానందస్వామీజీ, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, నూకపెయ్యి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీవో పరిశీలన



తెప్పోత్సవానికి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

అంతర్వేది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాఘమాసంలో ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం శ్రీలక్ష్మీనరసింహస్వామివారి తిరుకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లను ఆర్డీవో కె. మాధవి గురువారం పరిశీలించారు. ముందుగా స్వామి కల్యాణ మండప ప్రదేశం, రథం రోడ్డు, ఆర్టీసీ బస్సులు ప్రవేశ స్థలం, చక్రస్నానం, వసంత మండపం, స్వామివారి తెప్పోత్సవం జరగడానికి కొత్తగా తవ్వుతున్న చెరువు పనులను పరిశీలించి ఆలయ అధికారులతో మాట్లాడారు. తదుపరి సమీక్షా సమావేశానికి ఏర్పాట్లన్నీ పూర్తిస్థాయిలో జరగాలని, సముద్ర స్నానాలకు వెళ్లే రోడ్డు, వసంత మండపానికి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యుత్, పార్కింగ్, ట్రాఫిక్, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేందుకు అధికారులతో సమీక్షిస్తూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, ఆలయ అధికారులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, సీఐ పి.నరేశ్‌కుమార్, ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్, రాజోలు డిస్ట్రిబ్యూటరీ నీటి సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఈవోపీఆర్డీ ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సర్వేయర్ భద్రరాజు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అచ్యుతరామారావు



అచ్యుతరామారావును అభినందిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోళ్ల అచ్యుతరామారావు(శివజ్యోతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం సూర్య హోటల్‌లో గురువారం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా శ్రీనుబాబు(కాకినాడ శ్రీలక్ష్మీ టాకీస్), కోశాధికారిగా రాంబాబు(మండపేట సత్యశ్రీ), ఉపాధ్యక్షులుగా చినబాబు(పిఠాపురం సత్య థియేటర్), సదాశివరావు(ద్రాక్షారామ), సంయుక్త కార్యదర్శిగా నాని(లక్కవరం వేణుగోపాల్ థియేటర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అనుశ్రీ సత్యనారాయణ, సురేష్ మూవీస్ లక్ష్మణరావు, గీతా ఫిలిమ్స్ వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి సినిమాస్ అంజి, గౌరీ శంకర్, సత్తిరెడ్డి, హరిబాబు, జగ్గంపేట శివ, సూరపరాజు, సత్యకుమార్ తదితర ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు.

చలిమంటకు పూరిల్లు దగ్ధం

- వృద్ధుడి సజీవ దహనం
- తుని పట్టణంలో ఘటన

తునిరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో పూరిళ్లు దగ్ధమై వృద్ధుడు సజీవ దహనమైన ఘటన సంచలనం రేకెత్తించింది. తుని పట్టణం రామకృష్ణ కాలనీలో జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న తాతపూడి చిన్నయ్య (64) బుధవారం చలి మంట వేసుకుని నిద్రిస్తున్నాడు. ఈ సమయంలో పూరిల్లు అంటుకుని మంటలు చెలరేగాయి. ఆ వృద్ధుడు ఇంట్లోనే ఉండిపోవడంతో మంటలు ఎగిసిపడి బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోయింది. దీంతో కేకలు వేసినప్పటికీ అర్ధరాత్రి కావడంవల్ల స్థానికులు ఎవరూ సకాలంలో కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ వృద్ధుడు అప్పటికే మంటల్లో సజీవ దహనమయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఇటీవల భార్యతోపాటు కుమారుడు మరణించాడు. అప్పటినుంచి కూతుళ్ల సంరక్షణలో ఈ పూరింట్లోనే తలదాచుకుంటున్నాడు. ఘటనా స్థలాన్ని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అగ్నిప్రమాదంలో సజీవ దహనమైన వృద్ధుడు

24కిలోల గంజాయి స్వాధీనం

- కోటనందూరు సమీపంలో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- కారు స్వాధీనం



కోటనందూరులో గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

కోటనందూరు,జనవరి 9(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం-తుని రహదారిపై కోటనందూరు సమీపంలో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని బుధవారం రాత్రి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ప్రాంతం నుంచి ఓ కారులో తరలిస్తున్న 24.3కిలోల గంజాయిని బాపట్ల జిల్లా రామాలయానికి చెందిన మరుప్రోలు నాగేంద్రరెడ్డి, కందాల చిరంజీవి తీసుకువెళ్తుండగా కోటనందూరువద్ద పట్టుకున్నామని సీఐ చెన్నకేశవరావుతెలిపారు.దీనివిలువ రూ.48వేలు ఉంటుందన్నారు. తహశీల్దార్ సుభాష్ సమక్షంలో ఇద్దరిని అరెస్టుచేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

- ఐషర్ వ్యాన్‌లోకి దూరిన బైక్
- మోటార్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలు



పిండ్రాల చిన్నయ్య(ఫైల్)

కొత్తపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం పలివెల వంతెన సమీపంలో గురువారం ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొక మోటార్‌సైకిలిస్టు తీవ్రంగా గాయపడినట్లు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి పలివెల గ్రామానికి చెందిన పిండ్రాల చిన్నయ్య(31) చికెన్ దుకాణం సమీపంలో కొబ్బరికాయలతో రోడ్డు దాటుతుండగా అమలాపురంవైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు దాటుతున్న చిన్నయ్యను ఢీకొట్టి అతడిపై నుంచి వెళ్లి పోయింది. దీంతోపాటు రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడ్ని ఢీకొట్టగా అతడు వాహనంతోపాటు రోడ్డు అవతలి వైపున నిలిచి ఉన్న ఐషర్ వ్యానులోకి దూరిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో పిండ్రాల చిన్నయ్య అక్కడికక్కడే మృతిచెందగా మోటార్‌సైకిలిస్టు కొత్తపేట మండల పరిధి కొత్తపాలేనికి చెందిన కొప్పిశెట్టి వెంకరమణకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యంకోసం కాకినాడ తరలించారు. ఈ ఘటనపై మృతుని తండ్రి పిండ్రాల పెదపెద్దింట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.



సంఘటనాస్థలంలో చిన్నయ్య మృతదేహం

ఉమ్మడి జిల్లాలో నాటు సారా నియంత్రించాలి

ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్‌శర్మ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాటుసారాను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కట్టడి చేయాలని, మద్యంషాపులు, బార్లలో జరిగే నేరాలను నియంతించాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చైతన్యమురళి, కాకినాడ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రేణుకా, తూర్పుగోదావరి అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రగ్గుకు సిగరెట్టు అంటుకుని తీవ్రగాయాలు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొత్తపేట, జనవరి 9(ఆంధ్రజ్యోతి):కొత్తపేట శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన నివసిస్తున్న పిల్లి సత్యనారాయణ(68) అనే వ్యక్తి బుధవారం మంచెంపై పడుకుని సిగరెట్టు కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ రగ్గుకు అంటుకుని కాలిపోయింది. దీంతో అతడిని కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు. అతడి కుమారుడు పిల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ సువర్ణరాజు తెలిపారు.

గోదావరి కాలువలో దూకి వ్యక్తి గల్లంతు

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గేట్ సమీపాన గోదావరి కాలువపై నిర్మించి వంతెన రక్షణగోడ నుంచి దూకి ఓ లోకల్ పత్రిక జర్నలిస్టు గురువారం రాత్రి గల్లంతయ్యాడు. సంఘటనా సమాచారం తెలిసిన వెంటనే సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సంఘటనా స్థలికి చేరుకుని అతడి ఆచూకీకోసం ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కాకినాడ జిల్లా పెదపూడికి చెందిన సలీం అనే వ్యక్తి స్థానిక నిఘా పత్రిక జర్నలిస్టు. అతడు గురువారం ఓ మహిళతో కలిసి మోటార్‌సైకిల్‌పై సామర్లకోట మీదుగా కాకినాడ వెళ్తున్నాడు. రైల్వేగేట్ సమీపించే సరికి గోదావరి కాలువ పక్కన మోటార్‌సైకిల్ నిలుపుదల చేసి మూత్రవిసర్జనకు వెళ్తున్నానని ఆమెకు చెప్పి వంతెనపై నుంచి కాలువలోకి దూకేసినట్లు భావిస్తున్నారు. అటుగా వెళ్తున్న రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలిలో ఉన్న మహిళనుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

నలుగురికి జైలుశిక్ష

కపిలేశ్వరపురం,జనవరి9(ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నలుగురికి ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక్కొక్కరికీ మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు అంగర ఎస్‌ఐ డి.రవికుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాలప్రకారం.. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి సూర్యకుమారి ఇంట్లో లేనప్పుడు బంగారం వెండిఆభరణాలు చోరీచేశారు. దీనిపై బాధితురాలు సూర్యకుమారి 2023, జూలై 17న అంగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ జి.చంటి కేసు నమోదు చేశారు. వాదోపవాదాల తర్వాత నేరం రుజువుకావడంతో నిందితులు కాజులూరుకు చెందిన షేక్ అజీజ్, రాజమహేంద్రవరానికి చెందిన యడ్లఉషాసూర్యవెంకట రాకేష్, తాతపూడికి చెందిన కాండ్రేగుల శ్రావణ కృష్ణ, ఇంద్రపాలేనికి చెందిన ముషినాడ గౌరీ మల్లేశ్వరిలకు జైలు శిక్ష విధించారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

రాష్ట్ర పురోభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

» తిరుపతి తొక్కిసలాట దుర్ఘటన బాధాకరం » రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ దినకర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దినకర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర పురోభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ నాయకుడు, రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్రం నుంచి రాష్ట్రానికి భారీగా నిధులు తీసుకురావడంలో ఎంతో కృషి చేశారన్నారు.రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ రూ2 లక్షల 8 వేల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి మంజూరు చేశారని, ఉద్యోగ, ఉపాధికల్పనకు, ఆర్థికంగా రాష్ట్రం పురోభివృద్ధి సాధించడానికి ఇది దోహదపడుతుందన్నారు. తిరుపతిలో తొక్కిసలాట దుర్ఘటన బాధాకరమన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్స్ డోర్ డెలివరీ ఉపయోగించుకోవాలి

ప్రచార ర్యాలీ ప్రారంభించిన ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక



ప్రచార ర్యాలీ ప్రారంభిస్తున్న షర్మిల అశోక

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీని అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించుకోవాలని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక కోరారు. ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల ప్రచార ర్యాలీ గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి షెల్టన్ హోటల్, శీలం నూకరాజు వీధి, రామాలయం సెంటర్ మీదుగా నిర్వహించారు. అశోక మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 80 పట్టణాల్లో పది కిలోమీటర్ల వరకూ 50 కిలోల మేర పార్శిల్స్‌ను డోర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డీఎం షేక్ షబ్నం, జిల్లా ఏటీఎం (కమర్షియల్) కె.మాధవ, ట్రాఫిక్, గ్యారేజీ, ఆఫీస్ సిబ్బంది, హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన



సంక్రాంతి ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 4,8,37,40,41, 43, 44 డివిజన్లలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. 4 వ డివిజన్‌లో టీఎన్‌టీయూసీ నాయకుడు నక్కా చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్‌ల సారథ్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. తొలుత భోగిమంటలు వెలిగించారు. గంగిరెద్దులు, సంప్రదాయ నృత్యాలతో పోటీలు అలరించాయి. అనంతరం ముగ్గులను తిలకించారు. విజేతలకు ఈ నెల 11న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, యిన్నమూరి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, వెంకటేష్, ఉర్లంకల లోకేష్, ద్వారా పార్వతి సుందరి పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ సమస్యలపై
ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

కొవ్వూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ సమస్యలపై ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో భవన నిర్మాణదారులు, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలపై ఓపెన్ ఫోరంలో ఫిర్యాదులు అందించి పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు.

ముందే సంక్రాంతి



రంగంపేట: వడిశలేరు హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

» పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలు

కోరుకొండ/రంగంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ఇవ్వనుండడంతో గురువారం పలు పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలను నిర్వహించారు. రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల సంక్రాంతి సంబరాలను హెచ్ఎం వి.పార్థసారథి అన్నారు. ప్రారంభించాడు. చదువుతో పాటు సంస్కారాన్ని నేర్చుకోవాలని, ఆటపాటలతో ఆనందంగా గడపటం బాల్యం నుంచి అవర్చుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భోగి మంటలను వెలిగించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. హరిదాసు వేషంలో జస్వంత్ మైదానమంతా కలియదిరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జానపద గీతాలతో బృంద నృత్యాలు అలరించాయి. అలాగే వడిశలేరు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో భాగంగా ముగ్గులు, వాటిపై గొబ్బెమ్మలు, భోగి మంటల చుట్టూ నృత్యాలు, విద్యార్థుల సంప్రదాయ వేషధారణ, హరిదాసు వేషాలు అందరిని ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.



కొత్తపల్లిలోని ఆదర్శ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

గోకవరం: గోకవరంలోని జ్ఞాన సరస్వతి పాఠశాలలో పల్లె వాతావరణాన్ని తలపించే విధంగా కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల చైర్మన్ కం చర్ల సూర్యప్రకాశరావు, ఫౌండర్ అండ్ డైరెక్టర్ బొడ్డేటి సురేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, భోగి మంటలు చుట్టూ చిన్నారుల చేసిన కోలాటం ఆకట్టుకుంది. సూర్యప్రకాశరావు, సురేష్ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజమహేంద్రవరం కల్చరల్: ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వ హించారు. మన సంప్రదాయాలను గౌరవిస్తూ సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కళాశాలకు ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్ష అభియాన్ ద్వారా రూ.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీవీ.రమణమూర్తి, సిబ్బంది జి.శరత్ బాబు, వైస్వర్ణశ్రీ, బీహెచ్ఎస్. మూర్తి పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మల్లిడి పార్వతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు భోగి మంట వెలిగించి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే నారాయణ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి.

క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాలసీ

మంత్రి కందుల దుర్గేష్



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

కడియం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను, యువతను క్రీడల్లో ప్రోత్సహించే విధంగా ప్రత్యేక పాలసీ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సీకే నాయుడు క్రికెట్ టోర్నమెంట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓ ప్రక్క క్రీడలకు, మరో ప్రక్క కళాసంస్కృతి వైభవానికి సమ ప్రాతినిధ్యమిచ్చి అన్నిరంగాల్లో ముందుకు తీసుకు వెళ్లే విధంగా ప్రభుత్వం కృసి చేస్తోందన్నారు. యువత కోడిపందేలు, పేకాట జోలికి వెళ్లకుండా క్రీడలపై మక్కువ చూపాలన్నారు. ఇదిలా ఉండగా మాధవరాయుడుపాలెంలో సర్పంచ్ అన్నందేవుల చంటి సాగు చేస్తున్న మినుము, పెసలు పంటను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని, ఆరోగ్యకరమైన ఆహారానికి రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలన్నారు. చంటి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాను వరి, అపరాలు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ జిల్లాలో 37,641 ఎకరాల్లో 32,393 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పసల నాయుడు, గిరజాల బాబు, గట్టి సుబ్బారావు, వెలుగుబంటి నాని,ముద్రగడ జమీ, హెచ్ఎం సత్యనారాయణ, గట్టి నరసయ్య, రత్నం అయ్యప్ప, పాటంశెట్టి రవి, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ మహబూబ్‌వలీ, ఫార్మర్ సైంటిస్టు రాము, ఎస్ఎఫ్ఏ గౌతమ్ పాల్గొన్నారు.

రుడా సెక్రటరీగా సాయిబాబా
నియామకం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డవలెప్మెంట్ అథారిటీ (రుడా) సెక్రటరీగా ఎం వెంకటరత్న సాయిబాబాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరి సిసిఎల్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నసాయిబాబాను రుడా సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి జీవో ఆర్‌టీ 55ను గురువారం జారీ చేసారు. ప్రస్తుతం రూడా సెక్రటరీ గా శైలజావల్లి బదిలి పై స్పష్టత రావాల్సివుంది.

పరంపర ఉద్యోగాలను భరత్ అమ్ముకున్నారు

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి):గత ఐదేళ్లలో రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆంధ్ర పేపరుమిల్లులో పరంపర ఉద్యోగాలను ప్రవీణ్‌చౌదరితో కలిసి అమ్ము కున్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువా రం విలేకరులతో మాట్లాడారు. సుమారు 121 ఉద్యోగాలు రూ .15 నుంచి రూ.20 లక్షల వరకు ఉద్యోగానికి ఒక్కో రేటు పెట్టి అమ్ము కున్నారన్నారు. కోట్లాది రూపాయలను అప్పటి ఎంపీ భరత్‌రామ్, ప్రవీణ్‌చౌదరి, మిలు లో జైన్ కలిసి పంచుకున్నారన్నారు. ప్రవీణ్‌చౌదరి ఇటీవల తనను కలిసేందుకు ఫోన్ చేస్తే వాళ్ల చేసిన తప్పులను ఎత్తి చూపానన్నారు. తన వాయిస్‌ను ఈ రీల్స్ స్టార్ ఎడిట్ చేసి భరత్‌రామ్ పేరు ఉచ్ఛరించినచోట రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బు చ్చయ్యచౌదరి పేరు చేర్చారన్నారు. భరత్‌రామ్ రాజకీయ చాప్టర్ క్లోజ్ అయ్యిందని.. ఈ ఘటన తో తన ఉనికి చాటుకుని తెరమీదకు వచ్చేం దుకు చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఇంత నీతి మాలిన వ్యక్తిని చూడలేదన్నారు. చాం బర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా మా ట్లాడుతూ భరత్‌రామ్ కనీసం కార్పొరేటర్‌గా కూడా ఇప్పుడు గెలవలేడని, స్థాయి చూసుకుని మాట్లాడాలన్నారు. ఉమామార్కండేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యిన్నమూరి దీపు మాట్లాడుతూ పరంపర డబ్బు రూ.50 లక్షలకు ఎంపీ భరత్‌కు రూ.45 లక్షలు ఇచ్చానని ఇంకా రూ.5 లక్షల కోసం వేధిస్తున్నాడని ప్రవీణ్‌చౌదరి తనతో చెప్పాడన్నారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, ఇన్నీసు పేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ళ బాబు, జాంపేట బ్యాంక్ వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, ఆర్యాపురం బ్యాంక్ వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, డైరెక్టర్లు బుడ్డిగ రవి, పిల్లి శ్యామ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల పేరు మార్చకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం

అధికారుల ఉదాశీనతపై రామకృష్ణారెడ్డి ధ్వజం



పందలపాకలో సీసీ రోడ్ల ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కేంద్రాల పేరుని కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఊలపల్లిలో నిర్మించిన 6 సీసీ రోడ్లు, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం ప్రారంభోత్సవాలకు హాజరయ్యారు. రైతు సేవా కేంద్రం అన్ని చిన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలైనా రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా పరిషత్ సమావేశంలో 25 రోజుల క్రితం దీనిపై నేను ప్రస్తావించినా వ్యవసాయశాఖాధికారులు ఈవిషయాన్ని పంచాయితీ రాజ్ శాఖకు అప్పగించామని చెప్పారని అన్నారు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం వుందో లేదో తెలియకుండా వుందన్నారు. ప్రభుత్వం మారినా అధికారులు జగన్ వ్యామోహంలో ఉన్నారా అని ఆయన ప్రశ్నించారు. ఎరువుల కొరత వున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయన సేవా కేంద్రాన్ని ప్రారంభించకుండా గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లు, కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ బండారు రమ్య, ఎంపీటీసీ బండారు శివ, కూటమి నేతలు తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి, పడాల రాము, ఇందల వీరబాబు, పంచాయితీ కార్యదర్శి అచ్చియ్యచౌదరి పాల్గొన్నారు.

20 మంది బీజేపీలో చేరిక: ఊలపల్లిలో గురువారం పంచాయితీ మెంబర్ సిద్దనాటి గోపి, 20 మంది వైసీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నల్లమిల్లి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు. పందలపాకలో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అంతకు ముందు ఇళ్లపల్లిలో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, కూటమి నేతలు పడాల సూర్యనారాయణరెడ్డి, గుణ్ణం శ్రీనివాస చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

దివ్యాంగుల అవసరాలు సమకూర్చడంలో
ప్రత్యేక ఉపాధ్యాయులు కీలకం

దివాన్‌చెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కావలసిన ప్రత్యేక అవసరాలు సమకూర్చడంలో ప్రత్యేక ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాస రావు అన్నారు. బహుళ వైకల్యాలు ఉన్న పిల్లలకు కమ్యూనికేషన్ సవాళ్లతో పాటు వృద్ధి పరమైన ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు నన్నయలో గురువారం ప్రారంభం అయ్యాయి. ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ రాయుడుపాలెం, నన్నయ విద్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించారు. ప్రస్తుత కాలానుగుణంగా ప్రత్యేక ఉపాధ్యాయులు తమ పునరావాస నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, సంస్థ కార్యనిర్వాహక డైరెక్టర్ ఎస్.పి.రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో
అవధాన కళా వైభవం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం అవధాన కళా వైభవం పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. లలిత కళల విభాగాధిపతి సీతామహాలక్ష్మి అవధాన కార్యక్రమం ఉద్దేశంపై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఆంగ్ల శాఖ అధ్యాపకులు నూజిళ్ల శ్రీనివాస్, భూగర్భశాస్త్ర విభాగాధిపతి గౌతమ్, తెలుగు అధ్యాపకురాలు సుధామయి తదితరులు మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. వివిధ రకాలైన ఆహార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, లైఫ్ సైన్సెస్ విభాగ అధిపతులు కె.బాబు, బి.నాగేశ్వరి, అనుష, సోని, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌తో
ఎన్ఎస్ఎఫ్ కమిటీ భేటీ

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సమస్యలను స్వతంత్ర స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావును కలిసి సమస్యలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు జి.అమర్, కార్యదర్శి బి.వంశీ, ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్, వేమిశెట్టి సాయికుమార్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



శ్రీ లక్ష్మీనరసింహస్వామి

కోరుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం శుక్రవారం ఉదయం 5.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ స్వామి, అన్నవరం దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం ఉదయం పంచామృత అభిషేకం, వైకుంఠ ద్వార దర్శనం కోసం స్వామివారిని అలంకరించారు. భక్తులకు దర్శనమిచ్చే ఉత్తర ద్వారాన్ని కూడా అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజామున కోరుకొండ నరసింహస్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకుని తరించాలని రంగరాజ భట్టర్ స్వామి కోరారు. కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం ఉదయం 4.30 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య కోదండ రామాలయం వద్ద ఉదయం 4గంటలకు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇరగవరపు కృష్ణమాచార్యులు తెలిపారు.

శివాంజనేయ నర్సరీలో ఐఆర్‌పీఎఫ్ఎస్
అధికార బృందం సందడి



నర్సరీని పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్

కడియం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కడియపులంక మల్లు పోలరాజు - శివాంజనేయ నర్సరీని గురువారం దక్షిణ మధ్య రైల్వే ఐఆర్‌పీఎఫ్ఎస్ అధికారి, ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. నర్సరీ అధినేత, నర్సరీ సంఘం అధ్యక్షులు మల్లు పోలరాజు మొక్కను అందించి స్వాగతించారు. వారు మాట్లాడుతూ దేశ, విదేశీ మొక్కలు కడియం నర్సరీల్లో చూడటం ఆనందంగా ఉందన్నారు. బొన్సాయ్ మొక్కలు చూసి సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని రకాల ఆయుర్వేద మొక్కలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐఆర్‌పీఎఫ్ఎస్ సీనియర్ కమాండర్ జి.వలీశ్వర్‌బాబు, బి.సదయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలి

అన్న క్యాంటీన్ తనిఖీలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు రూ.15కే అల్పాహారం, రెండు పూటలా భోజనం అందించాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సిబ్బంది పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడారు. ఆహార పదార్థాలను సక్రమంగా అందించాలన్నారు. అనంతరం భోజనానికి వచ్చిన వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవెన్యూ ఆఫీసర్-2 సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శానిటేషన్ సెక్రటరీపై చర్యలకు ఆదేశం

నగరంలో పారిశుధ్య పనులను, 8వ డివిజన్ మస్టర్ ఆఫీసులో పారిశుధ్య కార్మికులు హాజరుపట్టిని కమిషనర్ తనిఖీ చేశారు. రోడ్డు సైడ్ హోటల్స్, పాన్‌షాపు పరిసరాలను పరిశీలించారు. తడిపొడి చెత్త విడదీసి సేకరించాలని విడదీయకుండా చెత్తను ఇచ్చే వారిపై జరిమానా విధించాలని ఆ డివిజన్ శానిటేషన్ సెక్రటరీకి గతంలో చెప్పానని, అయినా మార్పు రాలేదన్నారు. వెంటనే సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌వోను ఆదేశించారు. శానిటేషన్ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు ఇచ్చారు.

కోటిలో రీ సర్వే గ్రామసభ

కోరుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం కోటి గ్రామంలో రీ సర్వే గ్రామసభను గురువారం జరిపారు. గ్రామంలో తహశీల్దార్ సుస్వాగతం , రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ర్యాలీ జరిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు.



జీబీఆర్ విద్యార్థిని రూపొందించిన విష్ణుమూర్తి పెయింటింగ్

ఆకట్టుకున్న విష్ణుమూర్తి పెయింటింగ్

అనపర్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని బీ.లక్ష్మీ సుప్రజా పార్వతి పెయింటింగ్‌తో రూపొందించిన విష్ణుమూర్తి అవతారం ఆకట్టుకుంది. ఆమెను అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి

గోకవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మద్దాల నాగరాజు(110) గురువారం మృతి చెందింది. ఈమెకు నలుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. నెల రోజుల క్రితం తునిలో ఉంటున్న కుమార్తె ఇంటి వద్ద నాగరాజు ప్రమాదానికి గురవడంతో కాలుకు గాయమైంది. అప్పటి నుంచి ఆమె తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెంకట్రావు సేవలు అభినందనీయం



వెంకట్రావు దంపతులను సత్కరిస్తున్న సాయి ఆలయ కమిటీ

కడియం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉంటున్న తమ గ్రామంపై మక్కువతో ఆలయాభివృద్ధికి లక్షల రూపాయలు ఇచ్చిన దాత ముద్దుల వెంకట్రావు దాతృత్వం అభినందనీయం అని మురమండ మాజీ సర్పంచ్ ఈదర పాపారావు అన్నారు. ఇటీవల రూ. 20 లక్షలకు పైగా స్వీయ నిధులతో ఆలయ అభివృద్ధి చేసిన దాత వెంకట్రావు-సత్యదుర్గావాణి దంపతులను గురువారం సాయిబాబా ఆలయ కమిటీ సత్కరించారు. దాత మాట్లాడుతూ బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేయించేలా మురమండలో ఒక మెడికల్ లాబ్‌ను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఈదర పాపారావు, మద్దిపాటి సత్యనారాయణ, ప్రత్తిపాటి వెంకటరామయ్య, చెరుకూరి వీరవెంకట సత్యనారాయణ, కండెపు వెంకటరమణ చౌదరి, గారపాటి కృష్ణప్రసాద్, కోటిపల్లి అప్పారావు, మన్యం చినశ్రీను, శీను భాస్కర రావు, ఖండవిల్లి రామారావు, ఈలి రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

కేంద్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ గేటు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గురువారం పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పి తన మంత్రి పదవికి ఆయన రాజీనాయా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్టిన్ లూథర్, ఎం.శారద, అబ్దుల్ షరీఫ్, పి.శ్రీనివాస్, దోసపాటి సత్యప్రసాద్, నల్ల వీర్రాజు, డాక్టర్ వడయార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల ధర్నా





ముక్కోటికి ముస్తాబు..

ముక్కోటి ఉత్సవాలకు చినవెంకన్న ఆలయం ముస్తాబైంది.. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.. శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. జిల్లాలో ఉన్న వైష్ణవ ఆలయాలు వైకుంఠ ఏకాదశికి ముస్తాబయ్యాయి. - వివరాలు 6లో



సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది.. సరదా..సందడి తెచ్చేసింది.. చిన్నా పెద్దలు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు.. ఆకట్టుకున్నారు..అందంగా రంగవల్లులు వేశారు.. భోగిమంటలు వేశారు.. మూడు రోజుల పండుగను ఒకే రోజులో ముగించారు.. పాఠశాలలకు శుక్రవారం నుంచి సెలవులు కావడంతో నాలుగు రోజులు ముందుగానే జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో సంక్రాంతి పండుగ చేశారు..కొవ్వూరులో ఇలా - వివరాలు 6లో



సంక్రాంతి ఆట.. ఆనందమట

సంక్రాంతి పండుగ సందర్భంగా గోపాలపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి..విజేతకు ఎమ్మెల్యే కప్ అందించారు.

పండగ బాదుడే..



పెద్ద పండుగకు వద్దామంటే.. ప్రైవేటు దోపిడీ

- రైళ్లన్నీ రిగ్రేట్.. బస్సులన్నీ ఫుల్
- పండుగంతా ప్రైవేట్ స్పెషల్‌దే
- బస్సు టిక్కెట్ల ధరకు రెక్కలు
- రెట్టింపు ధరల వసూళ్లు
- సీటు అయితే రూ.2 వేలు
- బెర్త్ రూ.3 వేలు
- రద్దీ పేరిట భారీ వసూళ్లు
- ఆకాశంలో విమాన చార్జీలు
- మూడు రెట్లు పెరిగిన వైనం
- ఆర్టీసీ బస్సులకు భారీ డిమాండ్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సమీపించడంతో టిక్కెట్ ధరలు షాక్ కొడుతున్నాయి. సామాన్యుడికి అందకుండా ఆకాశాన్నంటుతున్నాయి. పండగకు ఇంటికి రావాలనుకునేవారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అధికంగా హైదరాబాద్ నుంచి వస్తారు. ప్రైవేటు ట్రావెల్స్ రెట్టింపు ధరలు పిండేస్తుండగా రైళ్లలో ఒక్క సీటు లేని పరిస్థితి. పోనీ విమానంలో వద్దామనుకుంటే అవి కూడా ఫుల్ అయిపోయాయి. డిమాండ్ పెరగడంతో ఇండిగో కంపెనీ చార్జీలను భారీగా పెంచేసింది. పండగ రద్దీ పేరుతో సాధారణ రోజుల్లో ఉండే విమాన చార్జీ ధర రూ.3,299 కాస్తా ఇప్పుడు ఏకంగా రూ.15,850కి పెరిగిపోయింది.ప్రధానంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఇండిగో రోజుకు ఆరు సర్వీసులు నడుపుతోంది. శుక్రవారం నాటికి ఐదు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా, ఒకే ఒక విమానంలో అరకొరగా సీట్లున్నాయి. అయితే వీటి చార్జీ ధర ఏకంగా రూ.15,086గా ఉంది. ఒకరకంగా ఐదు రేట్లు పెరిగిపోయి చార్జీలు షాక్ కొడుతున్నాయి. శనివారం అయితే నాలుగు విమానాల్లో సీట్లన్నీ నిండిపోగా రెండింటిలో మాత్రమే కొద్దిగా సీట్లున్నాయి. అయితే చార్జీలు రూ.14,486 చొప్పున కంపెనీ వసూలు చేస్తోంది. ఈనెల 12న అయితే టికెట్ ధరలు రూ.15,850 చొప్పున ఇండిగో వసూలు చేస్తోంది. 13న అంటే భోగి రోజున కాస్త డిమాండ్ తక్కువగా ఉండడంతో రూ. 11,650 వరకు చార్జీలు ఉన్నాయి. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో రైల్వేశాఖ హైదరాబాద్ నుంచి కాకినాడకు రోజుకు మూడు ప్రత్యేక రైళ్లను అదనంగా నడుపుతోంది. వీటిలోనూ సీట్లన్నీ నిండిపోయి వెయిటింగ్ లిస్ట్ 290 వరకు ఉంది. మరికొన్నింటిలో ఏకంగా రిగ్రేట్ చూపుతోంది. వీటిలో సీట్ల లభ్యత ఈనెల 14 నుంచి మాత్రమే ఉన్నాయి. పండగ తర్వాత తిరిగి హైదరాబాద్ ప్రయాణం అయ్యేవారికి ఇప్పటినుంచే విమాన చార్జీలు షాక్ కొడుతున్నాయి. ఈనెల 15న రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమాన చార్జీ సమయం బట్టి రూ.10,384 నుంచి రూ.14,887 వరకు ఎగబాకాయి. 16న ఏకంగా రూ.16,394 వరకు చార్జీలు పెరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే ఈనెల 19 వరకు తిరుగు ప్రయాణానికి సంబంధించి బాదుడే బాదుడు అన్నట్టు కొనసాగుతోంది.

రోజుకు రూ.1.65 కోట్ల దోపిడీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో కాకినాడ నుంచి 40 ప్రైవేట్ బస్సులు, అమలాపురం రాజోలు నుంచి 50 ప్రైవేట్ బస్సులు, రాజమహేంద్రవరం నుంచి 60 ప్రైవేట్ బస్సులు వెరసి 150 ప్రైవేట్ బస్సులు హైదరాబాద్, బెంగుళూరు పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కొక్క బస్సులోనూ సుమారు 50 నుంచి 55 మంది 8,250 మంది చొప్పున ప్రయాణిస్తుంటారు. పండుగ పేరిట స్పెషల్ ధరలతో ప్రయాణికుల నుంచి ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లు సుమారు రూ. 1.65 కోట్ల మేర ప్రతి రోజూ అదనపు వసూళ్లు చేస్తూ దారుణ దోపిడీకి గురిచేస్తున్నారు. అయినా ప్రభుత్వం కళ్లు తెరవకపోవడం గమనార్హం.

ఆర్టీసీ ఏం చేస్తుందో..

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంక్రాంతి బస్సు సర్వీసులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రజల నుంచి ఈ డిమాండ్ ఎక్కువగా వినబడుతోంది. ఇప్పటికే జిల్లా ఆర్టీసీ ప్రీ-సంక్రాంతి ఆపరేషన్‌లో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోల నుంచి 88 స్పెషల్ సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే ఈ స్పెషల్ సర్వీసుల్లో టిక్కెట్లన్నీ గతంలోనే హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. వీటితోపాటు షెడ్యూల్ సర్వీసుల్లోనూ టిక్కెట్లు లేవు. దీంతో హైదరాబాద్ నుంచి మరిన్ని బస్సులు నడపాలనే డిమాండ్ వస్తున్నట్టు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, చుట్టుపక్కల స్థిరపడిన వారు పెద్ద పండక్కి సొంతూర్లకు తరలివస్తారు. ఆర్టీసీ సర్వీసుల్లో సాధారణ బస్సు చార్జీలను మాత్రమే వసూలు చేస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. జిల్లా ఆర్టీసీ మాత్రం హైదరాబాద్ నుంచి జిల్లాకు మరిన్ని స్పెషల్ సర్వీసులు నడిపేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నట్టు కనబడుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా భారీగా ఆదాయం పొందే అవకాశం ఉన్నా ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారులు ఇప్పటివరకూ అదనపు స్పెషల్స్‌పై ఎలాంటి ప్రకటనా చేయలేదు.

పండుగ పూట.. ప్రైవేట!

సామర్లకోట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజుల్లో సంక్రాంతి. రైళ్లన్నీ ఫుల్ కావడంతో హైదరాబాద్, బెంగళూరు, మైసూర్, చెన్నై ప్రాంతాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, కాకినాడ, రంగంపేట, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, అటు కోనసీమ ప్రాంతాలకు వచ్చేందుకు ప్రైవేట్ ఏజన్సీల వద్దకు జనం పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆపరేటర్లు టిక్కెట్ల ధరలను అమాంతం పెంచేశారు. ఆన్‌లైన్‌లో భారీ ధరలకు టిక్కెట్ల విక్రయాలకు పోటీపడుతున్నారు. సంక్రాంతి పండుగను సొంతూళ్లో జరుపుకోవడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసుల కల. దీనిని ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. రైళ్లు ఫుల్ కావడంతో ప్రయాణికులకు ఏకైక ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న ప్రైవేట్ బస్సుల టిక్కెట్ల ధరలను పెంచేశారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి సామర్లకోట మీదుగా కాకినాడకు రూ.890-900 మధ్య టిక్కెట్ ధరలను వసూలు చేస్తారు. బెంగుళూరు నుంచి రూ.1,500 నుంచి రూ.1,800 మధ్య వసూలు చేస్తారు. ప్రస్తుత ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో హైదరాబాద్ నుంచి సామర్లకోటకు సీటు ఒక్కింటికి రూ. 1,880 వసూలు చేస్తున్నారు. ఇదే బెర్తులైతే రూ.2300-2600 చొప్పున వసూలు చేస్తున్నారు. చెన్నై, ముంబై వంటి ప్రాంతాల నుంచి టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అప్పర్, లోయర్ బెర్త్ అంటూ వేరు చేసి డిమాండ్‌ను బట్టి రూ.1,880 నుంచి రూ.3 వేల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు పిండేస్తున్నారు.

నేటి నుంచి ప్రైవేటు బస్సుల తనిఖీలు : డీటీవో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేసినా, ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ హెచ్చరించారు. వాహనాలకు సరైన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా జప్తు చేస్తామని స్పష్టంచేశారు. రాజమహేంద్రవరం డీటీవో కార్యాలయంలో గురువారం జిల్లాలోని ప్రైవేట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యజమానులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా తనిఖీలకు రవాణా అధికారులతో కూడిన స్పెషల్ టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. బస్సుల్లో ప్రయాణికుల లగేజీ బ్యాగులు మాత్రమే ఉండాలని, వాణిజ్యపరమైన వస్తువులను తరలించకూడదన్నారు. ప్రయాణికులు సురక్షితంగా తీసుకురావాలని కోరారు.

తెలుగు వెలగాలి

ముగిసిన తెలుగు మహాసభలు





రాజమహేంద్రవరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లకు సన్మానం చేస్తున్న జీజీయూ కులపతి చైతన్య రాజు, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, మాడుగుల నాగఫణిశర్మ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు

తెలుగు వెలగాలి.. తెలుగును బతికించుకుందాం.. తెలుగును కాపాడుకుందాం.. తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడదాం.. ఇంగ్లీషు వద్దు.. తెలుగేరా ముద్దు.. ప్రతి ఒక్కరి నోటా ఇదే మాట.. అందుకు ఏమైనా చేస్తామని.. ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తామని నాయకులు ప్రతినబూనారు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీయూలో చివరి రోజు గురువారం ప్రపంచ తెలుగు మహాసభ అట్టహాసంగా సాగింది. దీనిలో భాగంగా పలువురు ప్రముఖులు తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా అంటూ పిలుపునిచ్చారు.. తెలుగు ప్రాముఖ్యత నలుదిశలా వినిపించేలా చాటారు. 'తల్లిదండ్రుల్లో మార్పురావాలని.. తమ పిల్లలను తెలుగులోనే చదివించాలని .. కూటమి ప్రభుత్వం తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడు తుందని' కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.. 'సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారని, కింద స్థాయి నుంచి తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టడం కోసం త్వరలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుందని' మంత్రి కందుల దుర్గేష్ స్పష్టంచేశారు. 'మధురమైన, అద్భుత భాష తెలుగును భావితరాలకు అందించాలని.. ప్రపంచంలో ప్రజలు మాట్లాడే భాషల్లో తెలుగు 15వ స్థానంలో ఉండగా, మన దేశంలోని భాషల్లో తెలుగుకు నాల్గవ స్థానం ఉందని' బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు , రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు.. జీజీయూ చైర్మన్ చైతన్యరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది తెలుగు సంక్రాంతి పండుగను నిర్వహిస్తానన్నారు. కాగా తెలుగు మహాసభల్లో భాగంగా అచ్చతెలుగులో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అబ్బురపరిచాయి..



తెలుగు వీర లేవరా.. దీక్ష బూని సాగరా.. అంటూ చిన్నారి ప్రదర్శన..



ఇసుక అక్రమ రవాణా మూడు ప్రొక్లెయినర్లు సీజ్

కడియం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమాలు అన్నీ ఇన్నీ కాదు.. అయినా ఉన్నతాధికారులు మాత్రం ఎందుకో దృష్టి సారించడంలేదు.. మండల స్థాయి అధికారులు అడపా దడపా తనిఖీలు చేసినా రీచ్‌లలో చోరులు చిక్కుతున్నారు. కడియం మండలం వేమగిరి-బుర్రిలంక ర్యాంపులో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులతో కూడిన టాస్క్ పోర్స్ బృందం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది.ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించి మూడు ప్రొకెయినర్లను సీజ్ చేయించినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

రాత్రివేళ అక్రమ రవాణా

వేమగిరి-బుర్రిలంక ఇసుక ర్యాంపులో అర్థరాత్రి సమయంలో భారీ మొత్తంలో ఇసుక తరలింపు జరుగుతుందని జనసైనికులతో పాటు పలువురు ఆరోపిస్తున్నారు. భారీ యంత్రాల సాయంతో ఇసుక తరలిస్తున్న దృశ్యాలతో గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా, నాయకుల అండదండలతో అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలకు 37 కేంద్ర పథకాలు ఇస్తున్నాం

పథకాలపై సమీక్షలో ఎంపీ పురందేశ్వరి



కేంద్ర పథకాల అమలుపై సమీక్షిస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన జిల్లా అభివృద్ధి కో ఆర్డినేషన్,మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో లోపాలు గుర్తించి సమీక్షిస్తున్నామన్నారు. జిల్లా అధికారుల సూచనలు పరిగణనలోకి తీసుకుని కేంద్రానికి నివేదిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో 37 పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రతి మూడు నెలలకోసారి దిశ రివ్యూ మీటింగ్ నిర్వహిస్తామన్నారు. హెచ్ఎంపీవీ వైరస్‌ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో జలజీవన్ మిష న్, అమృత్ వంటి పథకాలు నిర్వీర్యం కావడం చూశామన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రానున్న రోజు ల్లో ప్రజలకు మేలు చేయాలన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మాత్రమే నిధులు వినియోగించాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధి నిధులు సమర్థవంతంగా ఖర్చుచేశామన్నారు. 60 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. సమీక్షలో జడ్పీ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు,ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ , జిల్లా అధికారులు వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు ,ప్రజాప్రతినిధులు ,అధికారులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు, యువత జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్టీ బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహంలో గురువారం ప్రాజెక్టు ఐరన్ ప్లస్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు.మనం నిత్యం తీసుకునే ఆహారంలో పోషక విలువలు ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.కౌమారదశలోని ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా నివారించే క్రమంలో ప్రాజెక్టు ఐరన్ ప్లస్ కింద ఐరన్ మాత్రలతో పాటు మునగాకు పొడిని వసతిగృహాల్లోని బాలికలకు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం హాస్టల్ విద్యార్థినులకు కలెక్టర్ భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి

కొవ్వూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఆసక్తి కలిగిన యువతీయువకులు జీవనోపాధుల జాతర కార్యక్రమంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. కొవ్వూరు పురపాలక సంఘ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందజేస్తున్నామన్నారు. పట్టణ పరిధిలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషియన్‌లు, ఏసీ, గీజర్, రిఫ్రిజిరేషన్, వాషింగ్‌మిషన్, వాటర్ ప్యూరిఫైర్ రిపేరు, బ్యూటీషన్, బిల్డింగ్ మేస్త్రి, పెయింటర్ మొదలగు సేవలకు పురుషులు, స్త్రీలకు ఎన్ఎస్‌డీఎస్ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోం ట్రై యాంగిల్ ప్లాట్ ఫారంలో ఆన్‌బోర్డు చేయడం ద్వారా జీవనోపాధి కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పాన్‌కార్డు, భార్యపేరు, సంఘం పేరు, కోడ్ నెంబర్లతో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి కొవ్వూరు మునిసిపాలిటీలోని మెప్మా విభాగంలో జరిగే జీవనోపాధుల జాతర కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు ఇద్దరి ఎంపిక



క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి

దేవరపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఓరుగంటి సాహితీశ్రీ క్రికెట్ అండర్-17లో జాతీయ స్థాయికి ఎంపికైనట్టు పీఈటీ నాగరాజు తెలిపారు. ఈ నెల 6, 7, 8తేదీల్లో జరిగిన పోటీల్లో 5మ్యాచ్‌లలో 200రన్స్ సాధించి బెస్ట్ బ్యాట్స్‌మ్యాన్‌గా నిలిచిందని, ఈ నెల 28న హైదరబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే అండర్-17 క్రికెట్ పోటీల్లో కుక్కల లీలా సాయిప్రసన్న బౌలర్‌గా ప్రతిభకనపరిచి రెండు వికెట్లు తీసి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు పీఈటీ తెలిపారు. అలాగే సెపక్‌తక్రా క్రీడల్లో వట్టి ప్రవీణ్, కళ్ళేపల్లి వర్షిణీ జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ సాధించారన్నారు. వీరు గతంలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించినట్టు తెలిపారు. వివిధ క్రీడల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులను పీఈటీ నాగరాజుతోపాటు ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, పీఎంసీ చైర్మన్ వేముల రాజు తదితరులు అభినందించారు.

వేళ్లచింతలగూడెంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

గోపాలపురం, జనవరి 09 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా వ్యాయామంతోపాటు మానసిక ఒత్తిడిని జయించవచ్చని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలోని సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆర్అండ్ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధుకృష్ణ, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు గురువారం రాత్రి ముగిసాయి. ఈనెల 7వ తేదీ నుంచి మూడురోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 8 టీములు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో నాలుగు బృందాలు సెమీ ఫైనల్స్‌కి రాగా, మూడో రోజైన గురువారం రెండు బృందాలు ఫైనల్‌కు వచ్చాయి. సాయి వైజాగ్ టీమ్ కృష్ణా టీమ్‌తో పోటీ పడింది. అర్ధరాత్రి దాటే వరకు మ్యాచ్ జరిగింది. గెలుపు ఎవర్ని వరిస్తోందోనని చలిని సహితం లెక్క చేయకుండా ఉత్కంఠగా వీక్షించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతజట్టుకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.40 వేలు, మూడో బహుమతిగా రూ.30వేలతోపాటు కప్‌ను అందజేయనున్నట్లు సంక్రాంతి సంబరాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బి.నాగేశ్వరనాయక్, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ కాకులపాటి లలితాశ్రీను, కమిటీ సభ్యుల కొర్లపాటి శ్రీరామ చంద్రమూర్తి, పిన్నమనేని చినబాబు, సంక్రాంతి సంబరాల కమిటి సభ్యులు పాల్గొన్నారు.

భూముల మార్కెట్ విలువ పెంపుపై
అభ్యంతరాలు స్వీకరణ

కొవ్వూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువ పెంపుపై అభ్యంతరాలను ఈ నెల 18వ తేదీలోగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేయాలని కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ సుందరరావు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల మార్కెట్ విలువ పెరుగుతుందన్నారు. ఈ మేరకు పెరిగిన రేట్లతో తయారుచేసిన జాబితాలను రిజిస్ట్రేషన్ డాట్ ఏపి డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతరాలను కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, ప్రజల నుంచి స్వీకరించిన అభ్యంతరాలను కమిటీ చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెంచిన రేట్లు అమలులోకి వస్తాయని సబ్ రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి.. గోపాలపురంలో నిరసన



గోపాలపురంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గోపాలపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు మటపర్తి రామ్మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించే వరకు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ మార్టిన్ లూథర్, పీసీసీ సభ్యులు జ్యేష్ఠ సతీష్‌బాబు, గన్ని రామారాయుడు, రమేష్, కౌలూరి రత్నరాజు, కౌలూరి బాబాజీరావు, ఏఐఎస్ఎం నాయకుడు సునీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఫ్రెండ్లీ షూ ఎంపిక



జాతీయ ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు షీల్డ్ అందిస్తున్న దృశ్యం

గోపాలపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞాన ప్రదర్శనలో గోపాలపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు గీతాసౌమ్యా, ఎస్.జ్యోత్న తయారు చేసిన ఫ్రెండ్లీ షూ.. సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల పాండిచ్చేరిలో జరిగే ఐదు రాష్ట్రాల ప్రదర్శనలో గోపాలపురం విద్యార్థులు పాల్గొంటున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. రాత్రి పూట పొలం గట్లపై తిరిగే రైతులకు తేలు, పాము తదితర విష జంతువులు కుట్టడంతో ప్రాణాలుపోతున్న ఘటనలు కట్టడి చేయడానికి ఉపయోగపడే విధంగా ఫార్మర్ ఫ్రెండ్లీ షూ తయారు చేసిన విద్యార్థులను పలువురు అభినందించారు. కేవలం రూ.500తో ఎల్ఈడీ లైట్లు అమర్చి బూట్లు రూపొందించినట్టు విద్యార్థులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు జిల్లా ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి



మల్లవరంలో డ్రోన్‌తో కషాయం పిచికారీకి సిద్ధమవుతున్న దృశ్యం

చాగల్లు, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు సాధికారిక సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్టు రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు జిల్లా ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి తెలిపారు. మండలంలోని మల్లవరం, నెలటూరు గ్రామాల్లో గురువారం సుమారు 50 ఎకరాల వరి పొలంలో డ్రోన్ సహాయంతో క్రిమిసంహార కషాయం పిచికారీ చేశారు. కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగు, రసం పీల్చే పురుగులు, వాటి గుడ్లను నివారించడం కోసం పిచికారీ చేసిన కషాయం ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. డ్రోన్‌లను ఉపయోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో కషాయాలను పిచికారీ చేయవచ్చునని, సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణరావు, సిబ్బంది ధర్మరాజు, రత్నకుమారి పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

గోపాలపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముసుగులో పేకాట, గుండాట, కోడిపందాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. గతంలో కోడిపందేలు నిర్వహిస్తూ కత్తులు కడుతున్న 170 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసిన నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు.

సంక్రాంతి..సంబరం



కొవ్వూరు హోలి ఏంజిల్స్ పాఠశాలలో విద్యార్థుల సంక్రాంతి ముగ్గు



తాళ్లపూడి మాంటిస్సోరీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల దృశ్యం

» పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలు

కొవ్వూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంక్రాంతి పండుగ సెలవులు ఇవ్వనుండడంతో గురువారం పలు పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు సంబరాలను నిర్వహించారు. కొవ్వూరు హోలి ఏంజిల్స్ పాఠశాలలో కరస్పాండెంటు వలియవీడు నెల్సన్ ఆంటోని ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో భాగంగా విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించి పోటీలు జరిపారు. విద్యార్థులు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను తెలియజేసే విధంగా ముగ్గులు, వివిధ కలాకృతులను తీర్చిదిద్దారు. తల్లిదండ్రుల ఓటింగ్ ద్వారా పోటీల్లో విజేతలను ఎంపికచేశారు. అనంతరం కళాశాలలో భోగి మంటలు వేసి, హరిదాసు కీర్తనలతో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జెస్సీ నెల్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో యాజమాన్యం తరపున తులసీ నిఖిలేష్ జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. కళాశాల ఫౌండర్ ప్రిన్సిపాల్ ఎస్వీ సుబ్బారావు సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, అధ్యాపకులు ఎ.రాణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మాంటిస్సోరీ పాఠశాలలో ప్రిన్సిపాల్ అనీష్ దంపతులు భోగి మంటలను వెలిగించారు. విద్యార్థులు నాలుగు బృందాలుగా ఏర్పడి సంక్రాంతి ముగ్గులు వేశారు. పాఠశాల ప్రాంగణమంతా పిల్లల ఆటపాటలతో సందడిగా మారింది. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక భాష్యం పబ్లిక్ స్కూల్లో ప్రిన్సిపాల్ జీవై రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు జోనల్ అధికారి ఎశివ నారాయణరెడ్డి విచ్చేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. స్కూల్ ఆవరణలో బొమ్మల కొలువు పెట్టారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. హరిదాసు, రైతు, పల్లె పడుచు వేషధారణలతోపాటు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, భోగి మంటలు ఆలరించాయి.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మోర్త నెం.2 పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ప్రధానోపాధ్యాయుడు ఎస్ ఎల్వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. భోగిమంటలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి. వేలివెన్ను అన్నపూర్ణ విద్యాసంస్థల అధినేత నందిగం భాస్కరరామయ్య ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో గొబ్బెమ్మలు, భోగి పళ్లు, పిండి వంటలు వంటి కార్యక్రమాలు విద్యార్థులు చేశారు. సంప్రదాయం ఉట్టిపడేలా రోకలిపోటుతో బియ్యం దుంచుడు, గ్రామీణ ప్రాంతాల్లో నూతిలో నుంచి చేద ద్వారా నీరు తోడే పని, హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి.



వేలివెన్ను అన్నపూర్ణ స్కూల్లో రోకలితో బియ్యం దంచుతున్న విద్యార్థులు



నల్లజర్ల భాష్యం పాఠశాలలో భోగి మంట వెలిగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం స్టడీ మెటీరియల్ పంపిణీ



కొవ్వూరులో స్టడీ మెటీరియల్ పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పేదరికం పేరుతో విద్య దూరం కాకుడదని ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బ్యాగ్‌లు, షూస్, మధ్యాహ్న భోజనం అందిస్తోందన్నారు. విద్యార్థులు స్టడీ మెరీయల్‌ను ఉపయోగించుకుని చేసుకుని 10వ తరగతి పరీక్షల్లో మెరిట్‌తో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, కౌన్సిలర్ పాలూరి నీలిమ, ఎంఈవో కిషోర్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈవో బాలామణి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లోని 465 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజయకేతనం స్టడీ మెటీ రియల్‌ను విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులంతా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, కౌన్సిలర్ ఎస్‌కే షాకీరా బేగం, మానేపల్లి రామకృష్ణ, యు.గురునాథం, ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వడ్లూరు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను సర్పంచ్ ఆర్.తేజశ్విని అందించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ మారుతీరామ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నిడదవోలులో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

హెచ్‌ఎంపీవీని ఎదుర్కోనేందుకు సిద్ధం

డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి.. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సందర్శన



కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో బాలింతతో మాట్లాడుతున్న పద్మశ్రీరాణి

కొవ్వూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): హెచ్ఎంపీవీ వైరస్‌ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి తెలిపారు. గురువారం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. వార్డుల్లో పర్యటించి, రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రసవ వార్డులో ఉన్న చిన్నారులకు అన్ని రకాల వ్యాక్సిన్‌లు, టీకాలు నిర్ణీత సమయానికి అందించడంతో పాటు రికార్డులు నమోదు చేయాలని సూచించారు. పద్మశ్రీరాణి మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్ వ్యాధి లక్షణాలతో వచ్చిన వారికి చికిత్స అందించడానికి పది నుంచి 15 బెడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. చిన్నపిల్లల వైద్యానికి డాక్టర్లు, మెడిసిన్, ఆక్సిజన్ అందుబాటులో ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి నిరోధానికి ఆసుపత్రికి వచ్చే రోగులు, బంధువులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించి, అవగాహనా కల్పిస్తున్నామన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యగా ప్రతిఒక్కరూ మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా కడుగుకోవాలన్నారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని, సొంత నిర్ణయాలతో మందులు వాడరాదన్నారు. ప్రజలు ఎటువంటి అపోహాలకు గురికావద్దన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే ఆసుపత్రుల్లో అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు పంపిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కె.సాయికిరణ్, సిబ్బంది ఉన్నారు.

ముస్తాబైన చిన వెంకన్న క్షేత్రం

» ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి సర్వం సిద్ధం
» ఉదయం 4-30 నుంచి.. భక్తులకు అనుమతి
» తిరుపతి ఘటన నేపథ్యంలో అధికారుల అప్రమత్తం..
» భారీ భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ కిశోర్





విద్యుత్ కాంతులతో ఆలయ గోపురాలు.. ఏర్పాట్లపై ఎస్పీ కిశోర్ అధికారులతో సమీక్ష



ద్వారకాతిరుమల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ద్వారకాధీశుని దివ్యక్షేత్రంలో శుక్రవారం జరగనున్న ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెల్లవారుజాము 4.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉత్తరద్వారం వద్ద దర్శనాలకు అనుమతిస్తామని ఈవో త్రినాథరావు తెలిపారు. ఉత్తర ద్వారాన్ని, స్వామి ఆశీనులయ్యే గరుడ వాహనాన్ని, పరిసరాలను పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. తొలుత వెండి గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో కొలువై దర్శనమిచ్చిన శ్రీవారు తర్వాత వెండి శేష వాహనంపై దర్శనమిస్తారు. ముక్కోటి నాడు స్వామిని దర్శించాలని దూరప్రాంతాల దీక్షాదారులు గురువారం రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. దర్శనానంతరం ఇరుముడులు సమర్పిస్తారు.

అధికారుల అప్రమత్తం

వైకుంఠ ద్వార దర్శన టికెట్ల జారీ నేపథ్యంలో తిరుమలలో చోటు చేసుకున్న పెనువిషాదాన్ని దృష్టిలో ఉంచుకుని ద్వారకాతిరుమల లో అధికారులు అప్రమత్తమయ్యారు. చిన వెంకన్న ఉత్తరద్వార దర్శనం సమయంలో ఏ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాటుచేశారు. ఆలయ సెక్యూరిటీని అప్రమత్తం చేయడంతోపాటు, పోలీస్ యంత్రాంగాన్ని పెంచామని ఆలయ ఈఈ భాస్కర్ తెలిపారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సెక్యూరిటీ విభాగం పనిచేస్తుందని వివరించారు. లైన్ల పొడవు పెంచామన్నారు. వాటిని పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లైన్లలో మంచినీరు, పాలు, మజ్జిగ అల్పాహారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 12 తాత్కాలిక టాయిలెట్లను నిర్మించామన్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు శీఘ్రంగా స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆలయంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రశాంత్ కిశోర్, ఇతర పోలీసు అధికారులు పరిశీలించి ఈఈ భాస్కర్‌తో చర్చించారు. పోలీస్ యంత్రాంగాన్ని పెంచుతున్నామని ఉత్తర ద్వారదర్శనం భక్తులందరూ వీక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

దేవరపల్లి: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని వైకుంఠ ఏకదశి సందర్భంగా విద్యుత్ కాంతులతో ప్రత్యేక అలంకరించారు. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలి పారు. 11న స్వామికి పుల రై సేవా ఉత్సవం సాయంత్రం ఊంజల్‌సేవ, 13న గోదారంగనాధుల కల్యాణం జరుగుతాయని చెప్పారు. ఈ దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ద్వార దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

టౌన్ ప్లానింగ్ సమస్యలపై
ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

కొవ్వూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ సమస్యలపై ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో భవన నిర్మాణదారులు, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలపై ఓపెన్ ఫారంలో ఫిర్యాదులు అందించి పరిష్కరించుకోవచ్చునన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ హెచ్‌సీ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బొడసకురు గ్రామానికి చెందిన కొప్పాడి వెంకటేశ్వర్లు(58) తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రం గోపాలపురంలో పండ్లు, చేపల వ్యాపారం చేస్తున్నాడు. గురువారం ఉదయం టీవీఎస్ మోపెడ్‌పై గోపాలపురం వెళ్తుండగా కొవ్వూరు మండలం కాపవరం గోవర్ధనగిరిమెట్ట జియో పెట్రోల్ బంకు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.ఈ ఘటనపై మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

హృదయాలయాన్ని సందర్శించిన
ప్రభుత్వాధికారులు



నిడదవోలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం శంకరాపురంలోని ఉచిత మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల హృదయాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గురువారం పలువురు అధికార్లు సందర్శించారు. పాఠశాల నిర్వహణ, పిల్లల ఆరోగ్య పరిరక్షణ, విద్యాబోధన పట్ల జిల్లా అధికార్లు సంతృప్తి వ్యక్తంచేసినట్లు పాఠశాల నిర్వాహకురాలు బలగం విశాలాక్షి తెలిపారు. ఈ పరిశీలనలో ఇన్‌స్పెక్షన్ టీమ్ కన్వీనర్ కె.భాస్కరరావు, కో కన్వీనర్ సి.రాజీకుమార్, ఆర్.అనంత ప్రదీప్, క్రాంతిలాల్, గౌరి తదితర్లు పాల్గొన్నట్లు తెలిపారు.

దివ్యాంగుల పింఛను అర్హతల
పరిశీలన పూర్తి

చాగల్లు, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.15 వేలు పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు 92 మంది ఉన్నారని వారికి సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ కార్యక్రమం రెండు రోజులపాటు జరిగినట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. మండలంలోని 13 గ్రామాల్లోను ఐదు బృందాలు పర్యటించి పరిశీలన చేసినట్టు చెప్పారు. కాకినాడ జీజీహెచ్ నుంచి ఆర్థోపెడిక్స్, జనరల్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్‌లతో కూడిన టీం పరిశీలన చేసినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

తిరుమల సంఘటన బాధాకరం

చాగల్లు, జనవరి 9, (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు లైన్‌లో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. గురువారం నందిగంపాడు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరిగిన సంఘటనతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఆయన వెంట దుర్గామల్లేశ్వరరావు తదితరులున్నారు.